# చైతన్యం

జులై 2022

రు. 20/-

సంకల్ప బలం

సామాజిక విలువల మాసపత్రిక





92 వ జన్మదినోత్సవం సందర్భంలో  అమర గంధర్వ గాయకుడు
మంగళంపల్లి బాలమురలీకృష్ణ గారిని స్మరించుకుంటూ




వ్యవస్థాపక సంపాదకురాలు

తీగవరపు శాంతి



# చైతన్యం

సంకల్ప బలం

సామాజిక విలువల మాస పత్రిక

జూలై 2022

సంపుటి -11 సంచిక - 10


## ఈ సంచికలో....


| | |
|---|---|
| సంపాదకీయం | 4 |
| గురువులు | 8 |
| గ్రీసు దేశపు పురాణ గాథలు | 10 |
| పరిగి బాబా | 17 |
| పూరీ జగన్నాధస్వామి వైభవం | 21 |
| మంచిమనసు | 23 |
| గోవింద గురుస్వామి మఠం | 26 |
| కారణ జన్ములు,సరస్వతీ అవతారం, శ్రీ బాలమురళీ కృష్ణ | 30 |
| దేవదేవుని పంచభూతలింగాలు | 31 |
| సాఫ్ట్ స్కిల్స్ | 37 |
| సామాజిక తత్వ శాస్త్రవేత్త బి ఎస్ రాములు | 43 |
| కాళిదాసు తెలుగువాడా? | 49 |



రచనలలోని అభిప్రాయాలు రచయితలవి మాత్రమే. పత్రిక యాజమాన్యానికి ఎటువంటి సంబంధమూ లేదు.

## తెలంగాణాలో ఎన్నికలే లక్ష్యంగా కాషాయం

రానున్న శాసనసభ ఎన్నికలే లక్ష్యంగా బూత్ స్థాయి నుండి భాజపాను బలోపేతం చేసేందుకు కష్టపడితే తెలంగాణలో అధికారంలోకి రావచ్చని పదాధికారుల సమావేశం లో బీజేపీ నేతలు ఉద్ఘాటించారు.

ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలో పార్టీ విధానాలు తమకు కీలక విజయాలను అందిస్తున్నాయని బీజేపీ పార్టీ అధికారులు అభిప్రాయపడ్డారు. భాజాపా కి దేశ ప్రజల ఆశీస్సులు బాగా ఉన్నాయని, ఇటీవల జరిగిన ఉత్తర ప్రదేశ్, ఉత్తరాఖండ్, గోవా, మణిపూర్ రాష్ట్రాల్లో విజయకేతనం ఎగురవేయడమే దీనికి నిదర్శనమని, యూపీలో గతంలో ఎన్నడూ గెలవని రాంపూర్, ఆజంగఢ్ లాంటి స్థానాల్లో కూడా ఈ మధ్య ఎన్నికల్లో గెలవడం మార్పునకు సంకేతమని అన్నారు. త్వరలో శాసనసభ ఎన్నికలు జరగనున్న హిమాచల్ ప్రదేశ్, గుజరాత్, కర్ణాటక, నాగాలాండ్ లలో విజయమే లక్ష్యంగా శ్రేణులు పని చేయాలని హైదరాబాదులో శనివారం ప్రారంభమైన భాజాపా కార్యవర్గ సమావేశాల్లో భాగంగా ఉదయం పదాధికారుల సమావేశంలో అన్నారు. సుమారు 5 గంటల పాటు జరిగిన ఈ సమావేశంలో 148 మంది పదాధికారులు పాల్గొన్నారు. భాజాపా జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా, బి. ఎల్. సంతోష్ లు జ్యోతి ప్రజ్వలనం చేసి ఈ సమావేశాన్ని ప్రారంభించారు. జాతీయ కార్యవర్గ సమావేశంలో ప్రతిపాదించాల్సిన రాజకీయ ఆర్థిక తీర్మానాల ముసాదియా పై సుదీర్ఘంగా చర్చించారు.

దేశంలో ఇటీవలి రాజకీయ పరిణామాలే కాక, ఉప ఎన్నికలు, రానున్న శాసనసభ ఎన్నికలపై చర్చించి, కేంద్ర ప్రభుత్వ స్వచ్ఛ పాలన, గరీబ్ కళ్యాణ్ యోజన వంటి పథకాలను ప్రజల్లోకి మరింతగా తీసుకు వెళ్లాలని నిర్ణయించడమే కాక , ఆగస్టు 15 లోగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ప్రకటించారు.

తెలంగాణాలోనూ మంచి వాతావరణం ఉందని, ప్రతీ ఇంట్లో మూడు రంగుల జెండా లక్ష్యంగా దేశంలో 20 కోట్ల మంది వద్దకు ఈ కార్య క్రమాన్ని తీసుకు వెళ్లి, ఇంటింటిపై జెండా ఎగుర వేసి దేశ ప్రజలందరినీ ఒక ఉద్యమంలా సంఘటితం చేయాలని నిర్ణయించాం అని వసుంధర రాజే తెలిపారు. భాజాపా అధ్యక్షుడు బండి సంజయ్ మాట్లాడుతూ జాతీయ నేతల ఆశీస్సులతో రాష్ట్రంలో భాజాపాను అధికారంలోకి తీసుకు వచ్చేందుకు కృషి చేస్తామని అన్నారు.

## తొలి రోజు రాజకీయ, ఆర్థిక తీర్మానాలపై భాజాపా జాతీయ కార్యవర్గ చర్చ

హెచ్ఐసీసీ వేదికగా భాజాపా జాతీయ కార్యవర్గ సమావేశాలు తొలి రోజు ముగిసాయి. సమావేశంలో రాజకీయ తీర్మానంపై కేంద్ర మంత్రి అమిత్ షా ప్రవేశపెట్టిన రాజకీయ చర్చ జరిగింది. కర్ణాటక, పుదుచ్చేరి తదితర రాష్ట్రాల్లో జరగనున్న ఎన్నికలు, అనుసరించాల్సిన వ్యూహాలపై కార్య వర్గం చర్చించగా, కేంద్ర రక్షణ మంత్రి రాజనాథ్ సింగ్ ఆర్థిక తీర్మానం ప్రవేశ పెట్టగా .. మరో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ సమర్థించారు. గరీబ్ కళ్యాణ్ యోజన కింద వివిధ పథకాలు విజయవంతమయ్యాయని నేతలు పేర్కొన్నారు.

## మోదీ మరో 20 ఏళ్ల పాటు పాలన అందించాలి .. నేతల అభిప్రాయం

హెచ్ఐసీసీ వేదికగా జరుగుతున్న భాజాపా జాతీయ కార్య వర్గ సమావేశాల్లో చర్చిస్తున్న అంశాలను కేంద్రమంత్రి స్మృతి ఇరానీ మీడియాకు వెల్లడించారు. దేశంలో పేదల అభ్యున్నతి, మహిళా సాధికారికత , స్వతంత్రతను మన స్వాతంత్ర్యసమర యోధులు ఆశించారని .. ఈ రోజు భాజాపా జాతీయ కార్యవర్గ సమావేశంలో ఇలాంటి అంశాలపైనే చర్చలు జరుగుతున్నాయని వెల్లడించారు. సామాజిక భద్రతకు సంబంధించి ప్రధాని మోదీ అమలు చేస్తున్న పథకాలపై చర్చించిన కార్యవర్గం దేశ ప్రజలకు భారత్ అందించిన సేవలు అసమానమైనవని ఆయన పేర్కొన్నారు.

## రాష్ట్రపతి అభ్యర్థి యశ్వంత్ సిన్హా పర్యటన

బేగంపేట విమానాశ్రయంలో రాష్ట్రపతి అభ్యర్థి యశ్వంత్ కు ముఖ్యమంత్రి కేసీఆర్ పుష్పగుచ్ఛం తో సాదర

స్వాగతం పలికారు. యశ్వంత్ సిన్హా రాష్ట్రపతిగా గెలిస్తే దేశ ప్రతిష్ట పెరుగుతుంది. ఓటు వేసేటప్పుడు రాష్ట్ర-పతి అభ్యర్థులను బేరీజు వేసుకుని నిర్ణయం తీసుకోవాలి, అంతేకాదు ఎమ్మెల్యేలు, ఎంపీలు మనస్సాక్షిని అనుసరించి ఓటు వేయాలి. అంతకు ముందు వీవీ గిరి కూడా అలాగే గెలిచారు. ఉన్నతమైన వ్యక్తి రాష్ట్ర-పతిగా ఉంటె దేశ ప్రతిష్ట పెరుగుతుంది. ఆయన ఉన్నతమైన వ్యక్తిత్వం కలవారు. రాజకీయాల్లో కీలక పాత్ర పోషించారు. అన్ని రంగాల్లో విశేషమైన అనుభవం ఉంది. వివిధ హోదాల్లో అత్యుత్తమ సేవలందించారు. రాష్ట్రపతి పదవికి అన్ని విధాలా అర్హుడు అని కేసీఆర్ తెలిపారు.

విపక్షాల రాష్ట్రపతి అభ్యర్థి పర్యటన తెలంగాణా కాంగ్రెస్ లో చిచ్చు రేపింది. అంతర్గతంగా ఉన్న విబేధాలు మరోసారి బయట పడ్డాయి. దీంతో రేవంత్ రెడ్డి, జగ్గారెడ్డి మధ్య మరోసారి వార్ మొదలయ్యింది.

### దేశానికి కేసీఆర్ వంటి నేత అవసరం

అసాధారణ పరిస్థితులలో రాష్ట్రపతి ఎన్నికలు జరుగుతున్నాయని విపక్షాల అభ్యర్థి యశ్వంత్ సిన్హా అన్నారు. భారత పరి రక్షణకు, పిల్లల బంగారు భవిష్యత్తు కోసం జరిగే పోరాటం ఇది అని, దేశంలో పరి-స్థితులు రోజు రోజుకు దిగజారుతున్నాయని, కేంద్ర ప్రభుత్వ విధానాలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం ఒక వ్యక్తి చెబితే 135 కోట్ల మంది వింటూ కూర్చోవడం కాదని, ప్రస్తుత పరిస్థితులలో కేసీఆర్ వంటి నేత అవసరమని యశ్వంత్ సిన్హా అభిప్రాయపడ్డారు.

### మోదీపై కేసీఆర్ తీవ్రమైన విమర్శలు

మోదీ పనితీరుతో అంతర్జాతీయంగా పరువు పోతోంది. తెలంగాణాపై కన్నేస్తే .. ఢిల్లీలో గద్దె దించుతాం. మహారాష్ట్ర మాదిరిగా ఇక్కడా చేస్తామంటే కుదరదు. నరేంద్ర మోదీ ప్రధాన మంత్రి లాగా కాకుండా సేల్స్ మాన్ లాగ వ్యవహరిస్తున్నారని, విద్వేషాలను రెచ్చగొడుతూ భారత భవిష్యత్తును నాశనం చేస్తున్నారని ము-ఖ్యమంత్రి కేసీఆర్ ఆరోపించారు. మోదీ హయాంలో ఏ రంగం బాగుపడలేదు, ఏ ఒక్కరు సంతోషంగా లేరు. రైతులు, సైనికులు, నిరుద్యోగులు, ఉద్యోగులు అందరూ ఇబ్బంది పడుతున్నారని, పెట్రోల్, గ్యాస్ తో పాటు నిత్యావసర సరుకుల ధరలు కూడా పెంచారని ధ్వజమెత్తారు. మోదీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఒక్కటీ నెరవేర్చలేదని, తానే శాశ్వతం అనే భ్రమలో ఉన్నారని కేంద్రంలో రాజకీయ మార్పు తప్ప-కుండా జరుగుతుందని కేసీఆర్ స్పష్టం చేశారు. ప్రధాని మోదీ హైదరాబాదు వచ్చారు. ఇక్కడ రెండు రోజులు ఉంటారు. రాష్ట్ర ప్రభుత్వానికి తెరాసా కు వ్యతిరేకంగా చాలా చెబుతారు. ఎన్ని ఆరోపణలు చేసినా మాకు వచ్చే నష్టం ఏమీ లేదు. మేము వేసే ప్రశ్నలకు హైదరాబాదు వేదికగా సమాధానం చెప్పాలి. డీజిల్ సహా అన్ని ధరలు విపరీతంగా పెంచేశారు. దానికి తోడు వ్యవసాయ చట్టాలు కూడా తెచ్చి రైతులను ఇబ్బంది పెట్టారు. వాటికి వ్యతిరేకంగా ఉద్యమించిన వారిని జీపులతో తొక్కించారు. వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకుని రైతులకు క్షమాపణ చెప్పాలి. ఇష్టం వచ్చినట్లు తప్పుడు నిర్ణయాలు తీసుకోవడం వల్ల 700 మంది రైతుల ప్రాణాలు పోయినా ప్రధానికి బాధగా లేదు అన్నారు కేసీఆర్.

### కాషాయ కమలం భారీ బహిరంగ సభ

హైదరాబాద్ లో క్రిక్కిరిసిన పరేడ్ గ్రౌండ్ సోదర సోదరీమణులకు నమస్కారం అంటూ ప్రధాని మోదీ తెలుగులో ప్రజలందరినీ ఉద్దేశించి ప్రసంగం ప్రారంభించారు. ఎంతో దూరం నుండి వచ్చిన కార్యకర్తలకు అభినందనలు తెలిపారు. తెలంగాణా నేల తల్లికి వందనం సమర్పిస్తున్నాను. తెలంగాణా గడ్డకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నా. తెలంగాణా మొత్తం వచ్చి ఇక్కడే కూర్చున్నట్టుగా ఉంది. హైదరాబాదు నగరం అన్ని రంగాల వారికి అండగా నిలుస్తోంది. ప్రాచీన సంస్కృతికీ, పరాక్రమానికి తెలంగాణా పుణ్య స్థలం. తెలంగాణా పవిత్ర భూమి. దేశ ప్రజలకు యాదాద్రి నరసింహ స్వామి, గద్వాల జోగులాంబ, వరంగల్ భద్ర కాళీ అమ్మ-వారి ఆశీస్సులు ఉంటాయి అంటూ ప్రారంభించిన ఆయన ప్రసంగం లో తెలంగాణాలోని అన్ని ప్రాంతా-లను, అన్ని దేవాలయాలను భద్రాచలం లోని రామాలయం లాంటి దేవాలయాలను పవిత్ర ప్రాంతాలుగా

అభివర్ణిస్తూ ఆయన ప్రసంగం కొనసాగించారు. భారీ బహిరంగ సభతో తెలంగాణా ప్రజలు ఆహ్వానం పలుకుతూ డబుల్ ఇంజన్ సర్కారుకు పట్టాలు వేస్తున్నారు అన్నారు భారత ప్రధాని మోదీ. సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్ లో ఏర్పాటు చేసిన విజయ సంకల్ప సభ లో మోదీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. భాజాపా జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్ నాథ్ సింగ్, కిషన్ రెడ్డి, యూపీ ముఖ్య మంత్రి యోగి ఆదిత్య నాథ్ కర్ణాటక సీఎం బస్వరాజ్ బొమ్మై , భాజాపా రాష్ట్రాల సీఎం లు,, డిప్యూటీ సీఎం లు, భాజాపా రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పలువురు రాష్ట్ర నేతలు హాజరయ్యారు. జల్లులు పడుతున్నప్పటికీ వర్షాన్ని సైతం లెక్క చేయకుండా రాష్ట్రం లోని వివిధ ప్రాంతాల నుంచి భాజపా కార్య కర్తలు భారీగా తరలి వచ్చారు. భారీగా తరలి వచ్చిన ప్రజలను చూసి .. బండి సంజయ్ ను మోదీ శభాష్ అని అభినందించారు. విజయ సంకల్ప సభ వేదికగా జేపీ నడ్డా చేవెళ్ల విశ్వేశ్వర రెడ్డికి పార్టీ కండువా కప్పి, విశ్వే-శ్వర రెడ్డిని భాజాపాలోకి ఆహ్వానించారు. భాజాపా అధికారంలోకి వచ్చాక తెలంగాణా ప్రజలకు భాజాపాపై ఎన్నో రెట్లు నమ్మకం పెరిగిందన్నారు. తెలంగాణా అభివృద్ధికి కేంద్రం అండగా ఉంటుందని, ఎనిమిదేళ్లలో కేంద్రం చేసిన అభివృద్ధిని వివరిస్తూ ప్రసంగం కొనసాగించారు.

రాబోయే రోజుల్లో రాష్ట్ర అభివృద్ధికి ఏ పనులు చేస్తారో వివరించారు. తెలంగాణలో 35 వేల కోట్ల విలువైన 5 భారీ సాగునీటి ప్రోజెక్టుల పనులు కొన సాగుతున్నాయన్నారు. సబ్ కా సాథ్, సబ్ కా వికాస్ మంత్రం తో తెలంగాణా అభివృద్ధి చేస్తాం, 8 ఏళ్లుగా జీవన ప్రమాణాలు పెంచేందుకు ప్రయత్నించాం. దళితుల, ఆది-వాసీల ఆకాంక్షలను భాజాపా నెరవేర్చింది. దేశ ఆర్థిక వ్యవస్థలో మహిళల భాగస్వామ్యం పెంచేందుకు ప్ర-యత్నించాం అలాగే కరోనా కష్టకాలంలో ఇక్కడున్న ప్రతీ కుటుంబానికి అండగా ఉన్నాం అంటూ రాబోయే రోజుల్లో ఏ పనులు చేస్తారో వివరించారు కానీ తెరాసాను ఉద్దేశించి ఎలాంటి విమర్శలు చెయ్యా లేదు.

డబుల్ ఇంజన్ సర్కార్ వస్తేనే తెలంగాణా వేగంగా అభివృది చెందుతుందని, డబుల్ ఇంజన్ సర్కార్ వచ్చి తీరుతుందని అన్నారు మోదీ. తెలంగాణా లోని రైతులకు లబ్ది చేకూర్చేందుకు ప్రయత్నిస్తున్నామని, పంటలకు కనీస మద్దత్తు ధర పెంచామని , తెలంగాణా ప్రజల ఆశీస్సుల కోసమే వచ్చా అని మోదీ అన్నారు.

టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి రేపు సంచలన ప్రకటన చేస్తా ...

తెలంగాణా కాంగ్రెస్ లో పార్టీ విభేదాలు మరింత ముదిరాయి. విపక్షాల అభ్యర్థి యశ్వంత్ సిన్హా పర్యటనపై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి చర్చించ లేదని ... ఎలాంటి సమావేశం ఏర్పాటు చేయకుండానే తమతో చర్చించినట్లు ఆయన చెప్పారని ఆరోపించారు. గోడకు వేసి కొడతా అంటూ అవమాన పరిచేలా రేవంత్ మాట్లాడుతున్నారని .. అలా రెచ్చ గొట్టడం వల్లే తాను మీడియా ముందు మాట్లాడుతున్నారని అన్నారు. రాజకీయ యుద్ధం చేయాలంటే వ్యూహం ఉండాలని అన్నారు. మొత్తం మీద హైదరాబాదంతా కాషాయం ప్లేక్సీలతో, పెరేడ్ గ్రౌండ్ అంతా క్రిక్కిరిసి జనాలతో భాజాపా హడావిడి హైదరాబాదులో ముగిసి, మోడీ రాత్రి రాజ్ భావంలో బస చేసి, ప్రొద్దుట 8 గంటలకు భీమవరం బయలు దేరి వెళ్లి, అల్లూరి సీతారామ రాజు విగ్ర హాన్ని ఆవిష్కరిస్తారు.

ఏపీకి ప్రత్యేక హోదా కల్పించండి ---- జగన్

విభజన వల్ల దెబ్బ తిన్నాం, ఏపీకి ప్రత్యేక హోదా కల్పించండి అంటూ ఏపీ ముఖ్యమంత్రి జగన్ మోదీకి విజ్ఞప్తి చేశారు. ఆంధ్ర ప్రదేశ్ తిరిగి కోలుకోవాలంటే ప్రత్యేక హోదా ఇవ్వాలని, తెలంగాణా డిస్కంలు ఆంధ్ర ప్రదేశ్ కు చెల్లించాల్సిన రూ. 6,627 కోట్ల బకాయిలను వెంటనే ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని జగన్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మోదీకి వినతి పత్రం కూడా అందిచ్చారు. రీసోర్స్ గ్యాప్ గ్రాంట్ అంశాన్ని ప్రధాని మోదీ దృష్టికి తీసుకు వెళ్లిన జగన్ గ్రాంట్ లో భాగంగా రావాల్సిన రూ 34,125 కోట్లు ఇవ్వాలని మోదీ ని కోరారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి సవరించిన అంచనాలు రూ 55,548 కోట్లకు ఆమోదం తె-లపాలని జగన్ విజ్ఞప్తి చేశారు. అలాగే జాతీయ ఆహార భద్రతా చట్టం కింద ఇచ్చే రేషన్ లో హేతుబద్ధం

లేదని ... దీని వల్ల రాష్ట్రానికి తీవ్ర నష్టం జరుగుతోందని చట్టాన్ని సవరించి ఆంధ్ర ప్రదేశ్ కు మేలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కొందరు ప్రజలు మోదీ గో బ్యాక్ అంటూ, నినాదాలు చేయడమే కాక, బ్లాక్ బెలూన్లతో నిరసన తెలపడమే కాక విమానాశ్రయంలో కూడా పైకి ఎగురవేసి మరీ ఆందోళన కలిగించారు. అంతే కాదు అక్కడ ప్రజలు కూడా విమర్శలు గుప్పించారు. ఆంధ్ర ప్రదేశ్ తెలంగాణా నుండి విడి పోయి నానా ఇబ్బందులు పడుతూ, ఆంధ్ర ప్రదేశ్ లో ఎటువంటి అభివృద్ధి లేకుండా ఉంటే, ఇప్పుడు ఓట్ల కోసం వస్తారా? అంటూ ప్రజల్లో అసహనం వ్యక్తమైంది. ఇన్ని సంవత్సరాలు మేము పడుతున్న ఇబ్బందులు చూస్తూ కేంద్రంలో ప్రధాన మంత్రి గా ఉండి, మాకేం చేశారు? ముందు ముందు ఏమి ఉద్ధరిస్తారంటూ ... వ్యతిరేకత తెలియజేసారు.

భీమవరంలో వీర దంపతుల కుమార్తెకు ప్రధాని మోదీ పాదాభివందనం

ప్రముఖ స్వాతంత్ర్య యోధులు పసల కృష్ణ మూర్తి, అంజలక్ష్మి కుటుంబ సభ్యులను మోదీ కలిసి వారిని ఆప్యాయంగా పలకరించి, ఆ వీర దంపతుల కుమార్తె పసల కృష్ణ భారతికి పాదాభి వందనం చేశారు. 90 ఏళ్ల వయసు ఉన్న కృష్ణ భారతి వీల్ ఛైర్ లో ఉండగా ఆమె పాదాలను తాకి పాదాభివందనం చేసి ఆశీర్వాదం తీసుకున్నారు.

అల్లూరి సీతారామ రాజు జయంతి కి ... ఎంపీ రఘు రాం

మన్యం వీరుడు అల్లూరి సీతారామ రాజు జయంతికి ప్రధాని నరేంద్ర మోదీ రావడం గర్వకారణమని వైకాపా ఎంపీ రామకృష్ణ రాజు అన్నారు. ప్రధాని వచ్చినప్పుడు సభకు వెళ్లాల్సిన బాధ్యత తనపై ఉందని ...తనను అక్కడకు వెళ్లకుండా చేశారని, విషనాగులు పాలకులైతే ఇలానే ఉంటాయని ఆయన వ్యాఖ్యానించారు. ఢిల్లీలో నిర్వహించిన మీడియాలో మాట్లాడుతూ, 'విష నాగులే' పాలకులవుతారని, లిస్టులో నానా పేరు లేదనే సరికి ఆశ్చర్య పోయా అని ఇవన్నీ తెలిసే ప్రోటోకాల్ వంటి అంశాలపై అధికారులకు ముందే లేఖ రాసా అని కోర్టులు ఆదేశాలిచ్చినా నా పేరు లిస్టులో ఎందుకు చేర్చలేదు అర్ధం కావడం లేదని అన్నారు.

మొత్తం మీద తెలుగు రాష్ట్రాల మీద ప్రేమతోనే వచ్చారా? ఎన్నికల వ్యూహంతోనే వచ్చారో ప్రజలు అంచనాలు వేస్తున్నారు.

అల్లూరి 30 అడుగుల విగ్రహావిష్కరణ

30 అడుగుల అల్లూరి సీతారామ రాజు విగ్రహావిష్కరణ ప్రధాని మోదీ జులై 4న భీమవరంలో ఆవిష్కరించనున్నారు. మన్యం వీరుడు, విప్లవ జ్యోతి అల్లూరి సీతారామ రాజుకు జాతీయ గుర్తింపు వస్తుండడంతో ఆయన చిన్నతనంలో నడయాడిన పశ్చిమ గోదావరి మురిసిపోతోంది. అంతే కాదు అల్లూరి సీతా రామ రాజు 124 వ జయంతిని జులై 4న ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవాల్లో భాగంగా అల్లూరి సీతారామ రాజు విగ్రహాన్ని ఆవిష్కరించి, భీమవరం సమీపంలోని పేద అమిరం లో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు.

ఎన్నికల వాడి వేడిలో రాజకీయ నాయకులు ఉన్నారు. ప్రజలు అధిక ధరలను భరించలేక సతమతమవుతున్నారు. నీతి నిజాయితీతో మన సంతోషం కోసమే పాలన చేసే నాయకులు ఎప్పుడొస్తారో, ఎవరొస్తారో .. రాముడా ! నువ్వే దిగిరా ...అనుకుంటూ ప్రజలు ఎదురు చూస్తున్నారు..

సర్వేజనా సుఖినోభవంతు



తీగవరపు శాంతి

# గురువులు

భువనచంద్ర



హర్యానా లోని ఓ మారుమూల గ్రామం. పేరుంది కానీ ఎవ్వరూ పేరుపెట్టి పిలవరు. పంజాబ్ నుంచి హర్యానా విడిపోయాక మాత్రమే ఆ వూరికి ఓ మాదిరి రోడ్డు పడింది. హర్యానా రోడ్ వేస్ వారు రోజుకో బస్సు ఏర్పాటు చేశారు కానీ, ప్రయాణీకులు అతి పలచగా ఉండడంతో ఆపేశారు. ఆపేసినందుకు కూడా ఎవరూ బాధపడలేదు, కంప్లయింట్ చెయ్యాలేదు.

అలాంటి ఊరులో ఓ నాడు మేము ఓ రాత్రి గడపవలసి వచ్చింది. కారణం చీకటి పడటమూ.. దారి సరిగా లేకపోవడమే కాక, ఆ ప్రాంతంలో దోపిడీ దారులు తిరగటం కూడా. దోపిడీదార్లకి మేం భయపడం కానీ, మాతో మేం తీసుకువెళ్ళే 'ఎక్విప్ మెంట్' ముఖ్యమైనది. అతి జాగ్రత్తగా తరలించాల్సిన మొబైల్ వర్క్ షాప్.

"ముఖియా ఎవరూ?" అడిగానొక 'దాదూ'ని.

"ఓ..." దూరంగా ఉన్న ఓ ఇల్లు చూపించాడు. మా వెహికిల్స్ ని రచ్చబండ దగ్గరే ఆపి అక్కడికి వెళ్లాం. బన్సల్ అనే హర్యాణాకా భాయ్ నాతో వచ్చాడు. మిగతా వాళ్ళు వెహికిల్స్ లోనే ఉన్నారు.

"ఆయీయే...మేరా నామ్ సంతోష్ యాదవ్" ఓ మధ్య వయస్కుడు నవ్వుతూ ఆహ్వానించాడు. అందరం కూర్చున్నాం. (అందరం అంటే ముఖియా, బన్సల్, వాళ్ళింట్లో అప్పటిదాకా నిలబడి వున్న కుటుంబ సభ్యులు.)

అవ్వాళ మమ్మల్ని వాళ్ళింట్లోనే భోజనం చెయ్యమన్నాడు. మృదువుగా తిరస్కరించాం. మా వాళ్ళలో కొందరికి చపాతీలూ, కూరా చెయ్యడం బాగా వచ్చు. భోజనానికి కావలసిన వస్తువులూ, స్టవ్ మాతో వున్నాయి.

పంచాయతీ కార్యాలయం తలుపులు తెరిపించి మాకు విడిది ఏర్పాటు చెయ్యడమే కాక నాలుగు నులక మంచాల్ని వేయించాడు ముఖియా.

చీకట్లు అలుముకుంటున్నాయి. చలికాలం మొదటి అడుగు వేసింది కనుక చల్లగా హాయిగా వుంది.

ఎడారుల్లోనూ, ఉత్తర ప్రాంతాల్లోనూ ఉండే 'చలి' ఇంకా ముదరలేదు. బ్లాంకెట్లు మాదగ్గర ఉండనే వున్నాయి. రాత్రి ఏడింటికల్లా భోజనాలు ఫినిష్ చేశాం. రెండు లాంతర్లూ వెలుగుతున్నాయి.

అప్పుడొచ్చాడు ఒకాయన. మావాళ్ళు ఎలర్ట్ గా లేచారు.

''ఆరామ్ కరో భాయ్ సాబ్... నేనూ ఒకప్పటి ఆర్మీ వాడినే. ఇదిగో నా ఐడెంటిటీ కార్డు" అని చూపించాడు. లాంతరు వెలుగులో చదివాను...సుఖ్ దేవ్ సింగ్ సోధీ. పంజాబీ అన్నమాట. మరి తలపాగా, కృపాణం, etc? నా మనసులో ప్రశ్న అర్థమయినట్టుగా తలాడించి, "ఆర్మీ నుంచి బయటికొచ్చాక మోడిఫై అయ్యాను భయ్యా" అన్నాడు. కొంతమంది అలా 'modify' అయినవాళ్ళు నాకు తెలుసు.

"చెప్పండి" అన్నాను.

"కేవలం పలకరించి పోదామని వచ్చాను. భాయ్.. మిలటరీ జీవితం మిలటరీదే. బయట ప్ర-

పంచానికి మనం ఏనాడూ అర్ధం కాము. ఈ సివిలియన్స్ వెంపర్లాడేది డబ్బు కోసం, పేరు కోసం, స్వార్ధం కోసం. స్వార్ధ రహిత ప్రేమ గురించి పది జన్మలెత్తినా వీళ్ళకు తెలీదు", ఓ సుదీర్ఘమైన నిట్టూర్పు విడిచాడు సుఖ్ దేవ్ సోధీ.

అప్పటికి నాకు అలాంటి అనుభవం లేదు గనక, మౌనంగా వున్నాను. ఇప్పుడయితే ఖచ్చితంగా అతని మాటలు నూటికి నూరు పాళ్ళూ నిజమని చెప్పగలను.

"ఇప్పుడేం చేస్తున్నారూ?" అడిగాను కొంచెం కుతూహలంగా.

"వెదుకుతున్నాను"

"దేన్ని గురించీ?"

"జీవిత పరమార్ధాన్ని గురించి వివరించే గురువు కోసం వెదుకుతున్నాను"

"ఎలా వెడుకుతారూ?"

"ఇదో వెతుకులాట అంతే. ఒకరి దగ్గరికి వెళ్లాను. అప్పుడాయన చెప్పాడు. 'గురువు కోసం వెతకక్కరలేదనీ....ఆయనే నీ దగ్గరకి వస్తాడనీ"

"నిజం..నిజం.. నాకు సిగరెట్టు తాగటం నేర్పిన గురువు తనంతట తానే నా దగ్గరకి వచ్చాడు. 'రమ్' తాగటం నేర్పిన గురువూ అంతే!", నవ్వుతూ మాటల్లో దూరాడు బన్సల్.

"సిల్లీగా మాట్లాడకు!" కసిరాను బన్సల్ ని.

"అతనన్నదీ నిజమే బంధూ. గురు బ్రహ్మ, గురుర్విష్ణు, గురుర్దేవో మహేశ్వరః అంటారుగా. నీ చేత సృష్టింపజేసేదీ, ఆ సృష్టించినదాన్ని సమతూకంలో నిలబెట్టేదీ, నీ బుద్ధిని లయం వైపుకు మళ్ళించేది కూడా గురువే. కొందరు 'బోధ' గురువులుంటే, కొంతమంది బాధించే 'బాధ' గురువులుంటారు", నిర్మలంగా అన్నాడు సుఖ్ దేవ్.

ఓ కొత్త 'అర్ధం' స్ఫురించింది. 'నేర్పే'వాళ్ళందరూ గురు సమానులే. నేర్పేదానిమీదే ఆధారపడివుంటుంది.... గౌరవించడమా, వద్దా అనే విషయం.

ఆ రోజు అలా గడిచిపోయింది.

**********

హిందీలో పాట పాడుతున్నాడు దహియా. అతని పూర్తీ పేరు నిరంజన్ దహియా. బిహారీ. చాలా బాగా పాడతాడు. 'లిరిక్' చెప్పమని అడిగా. Tme లేదని వెళ్ళిపోయాడు. అడిగి లేదనిపించుకున్నందుకు నాకు సిగ్గేసింది. పాట 'లిరిక్' (సాహిత్యం) గుర్తు లేకపోయినా ట్యూన్ గుర్తుంది. ఆ ట్యూన్ కి సరిగ్గా సరిపోయేట్టు తెలుగు పదాలు ఏర్చి కూర్చి పాట రాశా. ట్యూన్ ఉన్న 'ఫీల్' నేను రాసిన తెలుగు లిరిక్ లో ఉండేలా చూసుకున్నాను.

సాయంత్రం దహియా కనిపించగానే 'వన్ మినీట్' అని పొద్దున్న అతను హిందీలో పాడిన పాటనే తెలుగులో పాడి వినిపించా. అతని మొహంలో షాక్.

"యీ పాట మీ తెలుగులో కూడా ఉందా?", అడిగాడు.

"లేదు. పొద్దున్న నువ్వు వెళ్ళిపోయాక నేనే రాశాను", అన్నాను.

ఆ తరవాత నుంచీ నాకు నచ్చిన హిందీ పాట ట్యూన్లకి తెలుగులో లిరిక్స్ రాయడం మొదలెట్టాను. చివరికి అదే నా జీవితమైంది.

నా మొట్టమొదటి మ్యూజిక్ డైరెక్టరు సాలూరి వాసూరావు. నా మొదటి సినిమా డైరెక్టరు శ్రీ విజయ బాపినీడు. మొదటి సినిమా 'నాకూ పెళ్ళాం కావాలి". వాసూరావు గారు ట్యూన్ ఇచ్చిన పది నిముషాలలోనే పాట రాశా.

"ఇంతకు ముందు మీరు ఎవరి దగ్గర అసిస్టెంట్ గా పని చేశారూ?", అడిగారు వాసూరావు.

"ఎవరి దగ్గరా పని చేయలేదండీ" అన్నాను.

(25 వ పేజీ చూడండి)

# గ్రీసు దేశపు పురాణ గాథలు




## వేమూరి వేంకటేశ్వరరావు


**“Knowledge is acquired when we succeed in fitting a new experience into the system of concepts based upon our old experiences. Understanding comes when we liberate ourselves from the old and so make possible a direct, unmediated contact with the new, the mystery, moment by moment, of our existence.”**
**Aldus Huxley. “Knowledge and Understanding”**

## ముందు మాట

నేను ఈ వ్యాసాలు రాయడానికి ప్రేరణ కారణం ఒక విమాన ప్రయాణం. భారత దేశం వెళుతూ, శేన్ ఫ్రాన్సిస్కో లో ఉదయం 8 గంటలకి బయలుదేరి, నూ అర్క్ చేరునేసరికి సాయంత్రం అయిదు అయింది. పరుగుబాట మీదకి దిగడానికి విమానం సంసిద్ధం అవుతూ ఉండగా, “మనం దిగబోయే పరుగుబాట మీద మరొక విమానం ఉంది. కంట్రోలు టవర్ లో ప్రజలు నిద్రపోతున్నట్లు ఉన్నారు. మరో చుట్టు తిరిగి వస్తాను. అరగంట సేపు ఓపిక పట్టండి,” అని చోదకుడు విమానం జోరు పెంచుతూ పైకి లేచేసరికి ఇహ చేసేది ఏమీ లేకపోవడంతో నా కుర్చీకి ఎదురుగా ఉన్న టి.వి. లో ఏదైనా “ఇరవై నిమిషాల కార్యక్రమం” చూద్దామని వెతకడం ఉపక్రమించేను. “అపస్వరం అనే ఏపిల్ పండు కథ” ట. పదిహేను నిముషాలు ట. చూడడం మొదలు పెట్టేను.
పురాతన గ్రీసు దేశపు కథ. ఇంతకు పూర్వం నేనెప్పుడూ ఈ కథ గురించి వినలేదు. ఆసక్తితో చూసేను. గమ్యం చేరుకోగానే గూగుల్ లో వెతికేను. చాల ప్రాచుర్యం ఉన్న కథ. మా అమ్మాయిని అడిగితే, “చిన్నప్పుడు హైస్కూల్ లో చదివేను” అని చెప్పింది. నేను పుస్తకాల పురుగుని అయినా ఈ కథ నా కళ్ళ పడడానికి ఎనభై ఏళ్ళు పట్టిందంటే ఈ కథని వినని వాళ్ళు ఇంకా ఎంతమంది ఉంటారో అనిపించింది. ఈ కథ గురించి పరిశోధన చేస్తూ ఉంటే ఆసక్తికరమైన అంశాలు ఎన్నో తెలుసుకున్నాను. వాటన్నిటిని క్రోడీకరించి వ్యాసాలుగా రాసేను.
ఇక్కడ ఉటంకించిన అంశాలన్నిటినీ కేవలం ఒక నఖచిత్రంలా స్పర్శించినా ఇది పెద్ద గ్రంథం అవుతుంది. అందుకని కొన్ని ముఖ్యమైన అంశాలని మాత్రమే ముచ్చటించేను.

వేమూరి వేంకటేశ్వరరావు
ప్లెజంటన్, కేలిఫోర్నియా

# 19. పంకజ ప్రాదుర్భావం

**"The basic theme of mythology is that the visible world is supported and sustained by an invisible world."**
**- Joseph Campbell**



ఎన్నో గ్రీకు పురాణగాథలలో కొన్నింటిని మాత్రమే ఇంతవరకు మచ్చు చూసేం. ఇక్కడ ప్రస్తావించకుండా దాటేసిన కథలు ఇంకా చాలా ఉన్నాయి. ఈ కథలు అన్నిటిలోను ఉమ్మడిగా కనిపించే అంశాలు: సృష్టి జరిగిన విధానం, ఆ సృష్టిలో మూడు తరాల అమరులు అధికారం కోసం ఒకరితో మరొకరు పోటీపడడం. ఈ పోటీలో కేవలం ఒక ఆటవస్తువుగా మానవుడి స్థానం.


అమరులలో మొదటి తరం వారిని ప్రకృతి శక్తులకు ప్రతీకలైన, మూర్తిత్వం లేని, అభిజ్ఞానాలు (amorphous symbols) గా కానీ, అపరావతారాలు (personified concepts) గా కానీ భావించవచ్చు. ఇవే భూమి, ఆకాశం, వాటి కలయిక వల్ల పుట్టిన సముద్రాలు, కొండలు, వింతప్రాణులు, వగైరా. క్రమేపి మూడవ తరానికి వచ్చేసరికి ఒలింపస్ పర్వతం మీద స్థిరనివాసం ఏర్పరచుకున్న అమరులకు అతీంద్రియ శక్తులతోపాటు మానవ ఆకారాలు, మానవ బలహీనతలు వస్తాయి.



ఇలా పురాణగాథల మీద ఆధారపడ్డ తత్త్వ జ్ఞానంతో మన చుట్టూ ఉన్న ప్రపంచం ఇలానే ఎందుకు ఉందో చెప్పడానికి ప్రయత్నం చేసింది అలనాటి ఆ సమాజం. అనగా, ఎదురుగా జరుగుతున్న కార్యానికి వెనకనున్న కారణం ఏమిటో విశదీకరించడానికి ప్రయత్నం చేసింది. ఈ కారణం మనవాతీత శక్తుల ప్రభావం కూడా అయి ఉండవచ్చనే గట్టి నమ్మకం ఒకటి వారిలో ఉండేది. అనగా ప్రతి కర్మ వెనక కర్త ఒకటి ఉంటుందనిన్నీ, ఆ కర్త మానవుడైనా కావచ్చు, అమరలోకంలో-ఉన్న దేవుడైనా కావచ్చు.

ఉదాహరణకి సముద్రాలకి అధిదేవత అయిన పొసైడన్ సంగతి చూద్దాం. పెద్ద సముద్రతీరం ఉన్న ప్రాంతం కనుక గ్రీకులకి సముద్రదేవుడు చాల ముఖ్యుడు. ఈ ప్రాముఖ్యత చూపడానికి పొసైడన్ ఆయుధం త్రిశూలం. పొసైడన్ కి కోపం వచ్చినప్పుడు ఆ త్రిశూలం పట్టుకుని నేలని గట్టిగా గుద్దుతాడు. ఆ తాకిడికి భూమి కంపిస్తుంది. అదే భూకంపం. గ్రీకుల కారణ-కార్య చయనికలో దేవుళ్ళ పాత్ర ఇలా ప్రవేశిస్తుంది. కనుక గ్రీకుల దృక్పథంలో పొసైడన్ సముద్రదేవుడు అవడమే కాకుండా భూకంపాలకి కారకుడు కూడా! ఈ కోణంలో చూస్తే ప్రాచీన కాలపు గ్రీసు దేశస్థులకి ఎదుట కనిపిస్తున్న దృగ్విషయం వెనుక ఏదో కారణం ఉండాలనే నమ్మకం ఉండబట్టే ఆ కారణం ఏదో తెలియక కంటికి కనపడని దేవుడిని ఆశ్రయించారు.

ఈ సందర్భంలో హోమర్ తత్త్వజ్ఞానం గురించి మరి కొంచెం తెలుసుకుందాం. హోమర్ రచించిన ఇలియాడ్, ఆడెస్సిలు ప్రాచీన గ్రీకు సంస్కృతికి అద్దం పడతాయి కనుక ఈ రెండింటిని అధ్యయనం చేయడం గ్రీకుల




ఆలోచనా విధానాన్ని అర్థం చేసుకోవడానికి కీలకం; ఆ మాటకి వస్తే పాశ్చాత్య నాగరికతని, సృష్టిలో మానవుని స్థానం గురించి వారి ఆలోచనా విధానాన్ని అర్థం చేసుకోవడానికి కూడా కీలకం.

భారతీయ విలువలకి, సంస్కృతికి రామాయణ, మహాభారతాలు ఎలాంటివో పాశ్చాత్య విలువలకి, సంస్కృతికి ఇలియాడ్, ఆడెస్సిలు అలాంటివి అంటే అతిశయోక్తి కాదు.

ఇలియాడ్ లోని ఒకటి, రెండు ముఖ్యమైన అంశాలని తీసుకుని ఆ రోజులలో సృష్టి యొక్క నిజ స్వరూపం వారికి ఎలా అర్థం అయిందో చూద్దాం. ఒక ప్రశ్నతో





మొదలు పెడదాం.

ట్రోయ్ యోధుడు హెక్టర్ ఎందుకు చచ్చిపోయాడు?

అక్ఖిల్లీస్ చంపేడు కనుక హెక్టర్ చచ్చిపోయాడు!

అక్ఖిల్లీస్ ఎందుకు చంపేడు?

స్థూలంగా చెప్పుకోవాలంటే, గ్రీసు దేశానికీ ట్రోయ్ దేశానికి మధ్య యుద్ధం జరిగింది కనుక. ప్రత్యేకించి కారణం కావాలంటే, పాట్రోక్లస్ మరణానికి ప్రతీకారంగా అక్ఖిల్లీస్ హెక్టర్ని చంపేడు.

ఇలా వెతుకుతూ పోతే ప్రతి సంఘటనకి, ప్రతి కార్యానికి వెనక ఒక కారణం కనిపిస్తుంది. లేదా, ఒక కారణ-కార్య చయనిక కనిపిస్తుంది.

మరొక మెట్టు పైకి వెళ్లి చూద్దాం. ఇంతకీ గ్రీసు దేశం, ట్రోయ్ దేశం ఎందుకు యుద్ధం చెయ్యవలసి వచ్చింది?

పేరిస్, హెలెన్ ప్రేమలో పడ్డారు కనుక. తన భార్య మరొకని యెడల అనురాగం చూపుతున్నాదని ప్రతీకార జ్వాలలతో మెనలయస్ మండిపడుతున్న కారణంగా. అగమెంనాన్ అధికారదాహం ఎక్కువ అయిన కారణంగా. అక్ఖిల్లీస్ కి కీర్తి కాంక్ష ఎక్కువయి. ఇలా ఈ జాబితాని పొడిగించుకుంటూ పోవచ్చు. హోమర్ దృక్ క్షేత్రంలో మానవుడు చేసే కృత్యాలకి ప్రేరణ కారణాలు అనేకం: ప్రేమ, ప్రతీకా-




రం , అధికారదాహం, కీర్తి.

పైన ఉదహరించిన కారణ-కార్య చయనిక మానవ ప్రపంచంలో "సహజం" అని మనం సంతృప్తి పడవచ్చు. ఒక సంక్లిష్టమైన అం-తర్నాటకంలో మానవుల కోరికలు, వాటి ప్రేరేపణలు, తద్వారా జరిగే చర్యలు, ప్రతిచర్యలు కారణం-గానే ట్రోయ్ యుద్ధం లాంటి సమరాలు, హెక్టర్ మరణం లాంటి సందర్భాలు ఎదురవుతా-యి.

కానీ హోమర్ చెప్పిన కథ ఇంత సజావుగా సాగదు; ఎందుకంటే ఆ కథ అల్లికలో దేవుళ్ళకి కూడా ప్రముఖమైన పాత్ర ఉంది. హెక్టర్ కి అక్ఖిల్లీస్ కి మధ్య భీకర పోరాటం జరగబోయే ముందు హోమర్ కథా గమనాన్ని దేవుళ్ళ వైపు తిప్పుతాడు. వారంతా జరు-గుతున్న కార్యక్రమాన్ని స్వర్గం-లో కూర్చుని చూస్తూ ఉంటారు - ఇద్దరు ప్రత్యర్థుల మధ్య జరు-గుతున్న చదరంగపు పోటీని బయట నుండి ప్రేక్షకులు చూస్తు-న్నట్లు. కానీ తటస్థంగా ఉండరు; ఇరు పక్షాలని సమర్థిస్తూ, వాళ్ళకి సలహాలు ఇస్తూ, వారి ఆటలలో కలుగజేసుకుంటూ ఉంటారు. హెక్టర్ ని వెంటతరుముతు-న్న అక్ఖిల్లీస్ ని చూసి జూస్ ఒక పక్క అక్ఖిల్లీస్ ధైర్య సాహసాలని మెచ్చుకుంటూ, మరొక పక్క ప్రే-మానుబంధంతో హెక్టర్ ని సమ-ర్థిస్తూ ఉంటాడు. తాను ఎవరి పక్షం కాయాలి? తన్యతని భరిం-చలేక ఇతరులని సలహా ఇమ్మని కోరతాడు.

"Come you immortals, think this through. Decide.
Either we pluck the man from death and save his life
or strike him down at last, here at Achilles' hands"
(22:206-209)

ఎథీనా సలహా మేరకు హెక్టర్ చావుకే సమ్మతిస్తాడు, జూస్.



**“Go.
Do as your own impulse bids you. Hold back no more.”
So he launched Athena already poised for action — down the goddess swept from Olympus’ craggy peaks. (22: 200-223)**

ఇలా గ్రీకు దేవతలు మానవులని చదరంగం లోని పావులలా వాడుకుని ఆటలు ఆడుకున్నారు. వారిలో శక్తి యుక్తులు ఉన్నాయేమోకాని శీల సంపద ఉన్నట్లు కనిపించదు. అటువంటి దేవతలకి సహజాతీతమైన, ఆధిదైవిక (supernatural) శక్తులు ఉన్నాయని నమ్మి, వారిని ఆరాధించిన గ్రీకు ప్రజానీకానికి మంత్రాల మీదా, మహిమల మీదా, దేవుళ్ళు ఇచ్చే వరాల మీదా, శాపాల మీదా నమ్మకం ఉన్నట్లు కనిపిస్తుంది.

ఈ కాలపు ఆధునిక వైజ్ఞానిక, హేతువాద దృక్పథంతో చూస్తే వారిది చాల వెనకబడ్డ సమాజంలా అనిపిస్తుంది. ఇటువంటి “వెనకబడ్డ” సమాజం అకస్మాత్తుగా సా. శ. పూ. 5 శతాబ్దం వచ్చేసరికి ఒక్కసారి ఉలిక్కిపడి మేలుకున్నదా అనిపిస్తుంది. ఎందుకంటే నేడు ప్రపంచం నలుమూలల ప్రజ్వరిల్లుతున్న ఆధునిక, శాస్త్రీయ, తార్కిక దృక్పథానికి పునాదులు గ్రీసు దేశంలోనే పడ్డాయి. పంకిలమైన బురద భూమిలో ఈ పద్మం ఎలా పుట్టుకొచ్చింది? ఈ మార్పు ఏ పరిస్థితులలో జరిగిందో ఇటుపైన విచారిద్దాం.

# బహుముఖ ప్రజ్ఞాశాలి శ్రీ మత్స్యరాజ లక్ష్మీకాంతరావుగారు (పరిగి బాబా)

ఆచార్య మత్స్యరాజ హరగోపాల్



బాబాగారి శతజయంతి ఉత్సవాల సందర్భంగా విద్యా, సాహితీ సాంస్కృతిక రంగాలలో నాన్నగారి విశేష ప్రతిభ

బాబాగారి శతజయంతి సందర్భంగా ప్రత్యేక వ్యాసం



**జననం `విద్యాభ్యాసం**

మన రాష్ట్రంలోని షాద్‌నగర్ తాలూకా పాల్మాకుల సమీప గ్రామమైన గూడురులో దుందుభి నామ సంవత్సర ఆషాఢ బహుళ దశమి (21 జులై 1922) నాడు నర్సమ్మ, రంగారావు దంపతులకు మూడవ సంతానంగా జన్మించిన లక్ష్మీకాంతరావుగారు తన ఎనిమిదవ ఏట మత్స్యరాజ వేంకటమ్మ, రాంకిషన్‌రావు దంపతులకు దత్తత వచ్చారు. అలా పరిగి వాస్తవ్యులైనారు. పరిగి(నేటి వికారాబాద్ జిల్లా) లోని ఉర్దూ మాధ్యమ పాఠశాలలో రెండు, మూడు నాల్గు, అయిదు తరగతులు వరుసగా చదివారు. ఆ తర్వాత 7,8 తరగతులు మొగిలిగిద్దలో పూర్తి చేశారు. ఆపైన పాలమూరు ఉన్నత పాఠశాలలో విద్య నభ్యసించారు. ఆంధ్ర బాలానంద సంఘ సభ్యుడుగా ఆనాటి పరిస్థితులలో కూడా తెలుగు భాషాభివృద్ధికి ఎంతో కృషిచేశారు.

**విద్యాభ్యాసం` ఉద్యమ స్ఫూర్తి**

తదుపరి హైదరాబాద్‌లోని సిటీ కాలేజీలో ప్రవేశించారు. హిందూమహాసభ, ఆర్యసమాజం, స్టేట్‌కాంగ్రెస్‌ల ఆధ్వర్యంలో జాతీయోద్యమాలు నడుస్తున్న కాలమది. ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థులపై వందేమాతరం ఉద్యమ ప్రభావం పడిరది. అప్పటికే ప్రారంభమైన గోలకొండ పత్రిక, నీలగిరి వంటి తెలుగుపత్రికలు ఈ ఉద్యమాల వార్తలను ప్రచురిస్తూ ప్రోత్సాహాన్ని అందిస్తుండేవి. అప్పటి పాలకుడైన ఏడవ నిజాం ఈ రకమైన ఉద్యమాలను అణచివేయబూనినాడు. కాబట్టి కొన్ని గ్రంథాలను నిషేధించాడు. కొన్ని గ్రంథాలయాలపై దాడులు చేయించాడు. సభలలో వందేమాతర పాడటంపై నిషేధం విధించాడు. గీతాన్ని ఆలపిస్తున్నవారిని కళాశాలల నుండి తొలగించారు.

ఉద్యమంవైపు మొగ్గిన లక్ష్మీకాంతరావు రెండేళ్ల కళాశాల చదువు మధ్యలో ఆగిపోయింది. అయితే హైదరాబాద్‌లోని సీతారాంబాగ్‌లో ఉన్న వేదాంతవర్ధిని కళాశాలలో సంస్కృతం నేర్చుకొన్నారు. రెండు సంవత్సరాలు చదివి లా కోర్సు పూర్తి చేశారు.

కాలం వ్యర్థం చేయుటకు శ్రీ బాబాగారికి ఇష్టం లేదు. న్యాయవాదిగా నిలదొక్కుకోవాలనే



ఆలోచన కలిగింది. అందువల్ల న్యాయవాద వృత్తికి సంబంధించిన డిప్లొమా పూర్తి చేశారు. ఈ డిప్లొమా పూర్తితో లా కోర్సులో చేరడానికి ప్రవేశార్హత లభించింది.

హైదరాబాద్‌లో సిటీ కాలేజ్, సీతారాంబాగ్ లా కాలేజీ అన్ని రకాల విద్యలపై హైదరాబాదు స్వాతంత్ర్యోద్యమ ప్రభావం పడిరది. ఈ ఉద్యమాల్లో పాల్గొన్న ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థులకెందరికో రెస్టికట్ ఇచ్చారు. ఎందరో విద్యార్థులు చదువుల మానేసి, వ్యవసాయ, వ్యాపార ఉద్యోగాది రంగాలలో ప్రవేశించారు. ఈ పరిస్థితులలో శ్రీ లక్ష్మీకాంతరావు బాబా విద్యారంగాన్ని వదలక తప్పలేదు.

నాన్నగారిది సంయమన పద్ధతి. సంరెశాత (సంప్రదింపులు) ద్వారా వివాదాలు పరిష్కారం చేయడమే మంచిదని, కోర్టు మార్గాలు పట్టడం హింసా దౌర్జన్యాలను సమర్థించడం వారి ఉద్దేశాలు కావు. వీటినే నేడు మన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వెంకటరమణగారు కూడా సమర్థిస్తున్నారు.

18వ ఏట, మా తల్లిగారైన అనసూయదేవిగారితో వివాహమైంది. క్రమంగా ఆ దంపతులకు ఆరుగురు కుమారులు, నలుగురు కుమార్తెలు కలిగారు. ఈ విధంగా మాది ఒక పెద్ద సమిష్టి కుటుంబం.

1936లో కొండా వెంకట రంగారెడ్డిగారి అధ్యక్షతన షాద్‌నగర్‌లో జరిగిన ఆంధ్ర మహాసభలో లక్ష్మీకాంతారావు విద్యార్థి కార్యకర్తగా పాల్గొన్నారు. ఈ సభలు డిసెంబరు 15,16,17 తేదీలలో జరిగాయి. ఆరవ నిజాం మహబూబ్‌ఆలీ వద్ద దివాన్‌గా పనిచేసిన మహారాజా కిషన్‌ప్రసాద్ జాగీరు గ్రామం షాద్‌నగర్. అక్కడ జరిగిన ఈ సభల్లో అనేక అభ్యుదయకరమైన తీర్మానాలు ఆమోదింపబడ్డాయి. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా లవకుశ, శ్రీకృష్ణ రాయబారం నాటకాలు ప్రదర్శితమైనాయి. ఆ సభల్లో భాగంగా జరిగిన మహిళా మహాసభకు బూర్గుల రామకృష్ణారావుగారి సతీమణి అనంతలక్ష్మీదేవి

అధ్యక్షత వహించారు. ఆంధ్ర-మహాసభల్లో పాల్గొన్నందువల్ల లక్ష్మీకాంతారావుగారిలో ఆంధ్రాభి-మానమే కాదు, జాతీయాభిమా-నమూ మేల్కొన్నది.

ఆనాటి తెలంగాణ నిజాం పాలనలో రజాకార్ల దౌర్జన్యాలతో అపర యమలోకంగా మారింది. హిందూ ప్రజలు ప్రాణాలు అర-చేతిలో పెట్టుకొని జీవించారు. ఆ అంధకారపు రోజులలో పరిగి పట్టణ ప్రజలను జాగ్రత్తపరుస్తూ ఒక కాగడాగా నిలిచారు లక్ష్మీమ-కాంతరావుగారు. గ్రామంలో ఒక్క దుస్సంఘటన కూడా జరుగ-కుండా ప్రజలలో ధైర్యం కలిగిం-చారు. పోలీసుచర్య అనంతరం స్థానిక ముస్లింల రక్షణకు సైతం లక్ష్మీకాంతరావు శ్రద్ధ వహించారు. నేను జన్మించిన తరువాత మా నాన్నగారు 1948 నుండి రాజకీయ ప్రవేశం చేశారు.

నాన్నగారు రెండు సంవత్సరాల-పాటు అధ్యాపకులుగా పనిచేసా-రు. తరువాత విద్యా సాంస్కృతిక రంగాలలో బహుముఖంగా కృ-షిచేశారు. వారికి ఉపాధ్యాయు-లన్నా, ఉపాధ్యాయ వృత్తి అన్నా ఎంతో ఇష్టం. 1952`63 మధ్య కాలంలో పరిగి ఉన్నత పాఠశా-లలో నా విద్యాభ్యాసం జరిగింది. పరిగిలో హైస్కూలు ప్రారంభిం-చడానికి ఆయన ఎంతో కృషి చేశారు. వారి సంఘర్షణ ద్వారానే అప్పటిదాకా ఉన్న ప్రైమరీ స్కూలు ఉన్నత పాఠశాలగా ఏర్పడి కొత్త భవనాలతో ప్రారంభించబడిర-ది. 2, 3 సంవత్సరాలపాటు మా నాన్నగారు ఏ మాత్రం ప్రతిఫలం ఆశించకుండా ఈ పాఠశాలలో బోధించారు.

1960లో నేను 8వతరగతిలో ఉన్నప్పుడు నా క్లాసు విద్యార్థులు ఒక ఉపాధ్యాయుని నిరంకుశ ధోరణిపై సమ్మె చేశారు. అప్పుడు మా నాన్నగారు పాఠశాలకు వచ్చి అందరినీ సమాధానపర్చారు. ఆ తర్వాత ఆ ఉపాధ్యాయుడిని ధోరణి పూర్తిగా మారింది. అదే సంవత్సరంలో విద్యార్థుల ఉప-యోగార్థము సర్దార్ వల్లభబాయి పటేల్ పేరిట వాచనాలయము (గ్రంథాలయం) స్థాపించబడిర-ది. అందుకు సీనియర్ విద్యా-ర్థులు కూడా ఎంతో కృషి చేశారు. ఆ తరుణంలోనే నాన్నగారు జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షునిగా ఉండి పరిగిలో ప్రభుత్వ గ్రంథా-లయ స్థాపన చేయించారు. నేను హైస్కూలు చదువు ముగించిన తరుణంలో మా యింటి ప్రక్కన నివసిస్తున్న ఒక ఉపాధ్యాయు-ని పరిహసించినపుడు, నన్ను చెంపదెబ్బ వేసి ఆ టీచరు దగ్గ-రికి తీసుకవెళ్ళి కడుపులో తల పెట్టించి క్షమాపణ చెప్పించారు. ఆయనకు ఉపాధ్యాయులం-టే ఎంతో గౌరవం. ఆ కాలంలో మా యింట్లో అద్దెకున్న వారిలో అధికులు ఉపాధ్యాయులే.

సాహిత్య సాంస్కృతిక ఆధ్యాత్మిక, ధార్మిక సామాజిక రంగాలలో ఇతర ప్రాంతాలకన్నా తెలంగాణ ఎంత వెనుకబడి ఉందో వారికి తెలుసు అందుకే వారు రాజకీయ రంగంలో ఉన్నా, ఆధ్యాత్మిక రంగంలో ఉన్నా, వీటి వికాసా-నికి దోహదం చేశారు. జిల్లాప-రంగా విద్యావికాసానికి దోహదం చేసి సరస్వతీ శిశుమందిరాల-ను, ధార్మిక విషయాల ద్వారా సంఘటిత శక్తిని నిర్మించే విశ్వ-హిందూపరిషత్ కార్యక్రమాలను, సాహిత్యపరంగా జాతీయచైత-న్యాన్ని అందించే జిల్లా సాహితీ సమితిని, సాంస్కృతిక పరంగా పనిచేసే సంస్కారభారతిని, సేవా దృక్పథంతో నడిచే సేవాభారతిని విద్యా వైద్య పాలనా రంగాలకు సంబంధించిన ప్రభుత్వ ప్రైవేటు స్థానిక సంస్థల కార్యక్రమాలను శ్రీ లక్ష్మీకాంతరావు బాబాగారు ప్రో-త్సహించారు. ఇతరులు కూడా ప్రోత్సహించేట్లు చేశారు. ఒక సమన్వయవాదం, సామరస్య వా-తావరణం, ఏకతాభావం ఆశించి పనిచేసే సంఘటన తత్త్వం వారిలో కనిపిస్తుంది.

శ్రీ బాబాగారు నాటి దేశ ప్రధాని పి.వి.నరసింహరావుగారితో, రాష్ట్ర ప్రథమ ముఖ్యమంత్రి శ్రీ బూర్గుల రాంకిషన్‌రావుగారితో, శ్రీ చెన్నా-రెడ్డిగారలతో లాంటి నాయకుల-తో భుజం భుజం కలిపి ఆనాటి జాతీయ కాంగ్రెస్ పార్టీకి ప్రధాన కార్యదర్శిగా ఎంతో సేవలందించి రాజకీయంగా విశిష్ట స్థానాలందు-కొన్నారు. ప్రజాస్వామ్యంతో కీలక-మైన కార్యరంగం, విద్య, వైద్యం, సాంఘిక న్యాయం, బీద జన ఉద్ధరణ ఇలా ఎన్ని రంగాలకో శ్రీ బాబా సేవలందించారు.

కశ్మీర్ పండితుల ఊచకోతపై వారి ఉపన్యాసాలలో ఎన్నోమార్లు

ప్రస్తావించేవారు. ఈ విషయంలో ఇటీవల భారత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో వారు జీవించి ఉంటే ఎంతో సంతోషించేవారు.

**పూజ్యశ్రీ లక్ష్మీకాంతరావు బాబాగారి జీవితంలోని ముఖ్య ఘట్టాలు**

1. పర్గిలో, మహబూబునగర్‌లో, హైదరాబాదు సిటీ కాలేజీలో చదువులు, ఉర్దూ, తెలుగు,హిందీ, సంస్కృతం, ఇంగ్లీషు భాషల అధ్యయనం, సంస్కృతంలో పరీక్ష, లా లో డిప్లొమా చదువు.

2. వందేమాతరం, జాతీయ, నిజాం వ్యతిరేక ఉద్యమాల కారణంగా చదువుకు స్వస్తి, రాజకీయ రంగంలో పి.వి., బూర్గుల, మాడపాటి వంటివారి నాయకులతో కలిసి పనిచేయడం, పర్గి పట్టణానికి మున్సిపల్ చైర్మెన్‌గా సేవలు. రాజకీయ, సామాజిక, ధార్మిక రంగాలకు విశేష సేవలు.

3. రామాయణ, భారత, భగవద్గీత, భాగవతాదులపై విశేష ప్రసంగాలు. వేలకొలది ఆధ్యాత్మిక ప్రసంగాలు, చైతన్య మహాప్రభు నామ సంకీర్తనను సామాన్య ప్రజానీకానికి అందించడం ద్వారా, వారి సేవలకు గుర్తింపుగా వారి విగ్రహాన్ని 'నవద్వీప్' బెంగాల్ హరనాథ్ మందిరంలో ఏర్పాటు చేశారు. పరిగి పట్టణ సమీపంలోని యోగానంద లక్ష్మీనరసింహస్వామి క్షేత్రమైన రాకమచర్ల క్షేత్ర ఆలయ జీర్ణోద్ధరణ, ఆ క్షే-




త్రంలో సహస్రాధిక భగవద్గీత జ్ఞాన యజ్ఞాల నిర్వహణ, సత్సంగ మండలి వికాసానికి కృషి, శ్రీరామ జయరామ జయజయ రామ జపము. వేంకటదాసులవారి ఉమ్మెంతాల పీఠాన్ని ఆధ్యాత్మిక వికాస కేంద్రంగా చేయడంలో తోడ్పాటు. పరిగి సమీపంలోని లొంక ఆంజనేయస్వామి ఆలయ జీర్ణోద్ధరణ.

4. పర్గిలో విద్యావికాసానికి, పాఠశాలకు స్థల సేకరణ, సరస్వతీ శిశుమందిర్‌కు స్థల దానం, భారతీయ విద్యావికాసానికి కృషి, భాగ్యనగర్ విశ్వహిందూ పరిషత్‌కు అధ్యక్షత `ఇతర బాధ్యతలు, పర్గిలో వైద్యశాల వికాసానికి కృషి, రంగారెడ్డి జిల్లాలో విశ్వహిందూపరిషత్‌కు ప్రోత్సాహం. ఇలాంటి అనేక సంస్థల సాహిత్య, సాంస్కృతిక, ధార్మిక కార్యక్రమాల వికాసానికి కృషి.

5. వినోబా భూదానోద్యమానికి 500 ఎకరాల పైచిలుకు దానం చేయడం, భూదానోద్యమంలో చురుకుగా పాల్గొనడం. శ్రీ జయప్రకాశ్ నారాయణగారితో భూదానోద్యమాల్లో పాల్గొనడం.

6 మానవీయత నుండి మానవుడు దివ్యత్వంవైపు సాగాలన్న తపన, వ్యాసుల వారి నుండి వివేకానందుల వరకు అందరూ మన గురువులే అన్న ఆదర్శం.

**ముగింపు**

జులై 21, 2022 నుండి నాన్నగారి శతజయంతి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంలో పరిగి పట్టణంలోని నాన్నగారి విగ్రహంవద్ద బహిరంగ సభ ఏర్పాటు, శ్రద్ధాంజలి ఘటించాలని ఏర్పాట్లు జరుగుతున్నాయి. పట్టణంలోని కోర్టు భవనాల నుండి తహసీల్ ఆఫీసు వరకు ముఖ్యమైన రోడ్డు మా నాన్నగారు 'మాన్యశ్రీ లక్ష్మీకాంతరావు బాబాగారి పేరిట' నామకరణం చేస్తూ శిలాఫలకం ఏర్పాటుచేయడం. సంవత్సరం పాటు జరిగే వివిధ సాహితీ సాంస్కృతిక ఆధ్యాత్మిక కార్యక్రమాలను పరిగి పట్టణం, రాకమచర్ల క్షేత్రం జిల్లా కేంద్రమైన గంగవరం (వికారాబాద్), శంకరపల్లి, భాగ్యనగరం తదితర ప్రాంతాల్లో జరపాలని , తద్వారా పరమ హైందవ యోగీశ్వరుడు, స్వాతంత్ర్య సమరయోధుడికి ఘన నివాళ్లు అర్పించాలని పెద్దలు నిర్ణయించారు.

ఆనో భద్రాహః ఋతవో యంతు విశ్వతః (ఋగ్వేదం)

అన్ని వైపుల నుండి మంచి ఆలోచనలు మనలో ప్రసరించుగాక.

# పూరి జగన్నాధ స్వామి  వైభవం

డా.పోచనపెద్ది వెంకట మురళీ కృష్ణ



పూరి జగన్నాధుని రధయాత్ర తెలుగువారికి అత్యంత ప్రీతి పాత్రమై నది.కాని ఆ స్వామికి సంబంధించిన పురాణగాధ సంపూర్ణంగా కొద్దిమందికి మాత్రమే తెలుసు.

స్కాందపురాణాంతర్గతమైన జగన్నాధ క్షేత్ర మాహాత్మ్యాన్ని యధామూ లంగా, సరళ, వ్యావహారిక భాషలో అనువదించి మన పాఠకులకు ప్రతి నెల అందిస్తున్నాము.   చదవండి, చదివించి మోక్షాన్ని పొందండి.

- సంపాదకురాలు

## 37 వ అధ్యాయం

### దక్షిణాయనం

దక్షిణాయనంలో స్వామిని పంచామృతాలతో అభిషేకం చేయాలి.అగరు,చందనాలతో స్వామికి రాసి,పుష్ప మాలతో అలంకరించాలి.భఖ్య,భోజ్యాలు స్వామికి సమర్పించి,హారతి ఇవ్వాలి.నృత్య గీతాదులు స్వామికి సమర్పించాలి.  ఈ రకంగా అర్చించబడిన స్వామిని చూసినచో పాపాలు నశించిపోయి,విష్ణులోకం లభిస్తుంది.  దక్షిణాయన సంయంలో స్వామిని చూసినవారికి తక్షణం ముక్తి కలుగుతుంది.ఈ సమయంలో బ్రహ్మకు వాస్తుపురుషునకు,విష్ణువునకు,అగ్నిలో ఆహుతి ఇవ్వాలి.రాజు, శ్రౌత,స్మార్తం తెలిసిన ఆచార్యుని నియమించాలి.ఈశాన్య  ద్వారందగ్గర  ప్రచండునికి,దక్షిణద్వారందగ్గరవిరూపునికి,గరుడునికి,నైరుతిలో సరస్వతికి,తూర్పుదిక్కున మహలక్ష్మికి ఇంధ్రునికి,ఆగ్నేయంలోఅగ్నికి,వాయువ్యంలోవాయువునకు,మధ్య భాగంలో బ్రహ్మకి ఆహుతులు ఇవ్వాలి(1 -19).  ఆచార్యులను,సేవకులను నియమించాలి. లక్ష్మీ దేవి వంట చేసి,స్వామికి నైవేద్యంగా సమర్పిస్తుంది.ఆప్రసాదాన్ని మనం స్వీకరిస్తే,సురాపానాది పాపాలు నశిస్తాయి. ప్రసాదాన్ని వాసన చూస్తే మానసికమైన పాపాలు పోతాయి.కంటికి పూసుకుంటే శారీరకమైన పాపాలు



పోతాయి.పితృకార్యంలో స్వామి ప్రసాదాన్ని వినియోగిస్తే వారు సంతోషపడతారు.హవ్య,కవ్యాలలో స్వామివారి ప్రసాదాన్ని వినియోగించ వచ్చు,దేవతలు మానవ రూపాన్ని ధరించి భూలోకానికి వచ్చి స్వామి వారి ప్రసాదాన్ని స్వీరిస్తూ ఉంటారు. ( 16 --26 )

పూర్వకాలంలో శ్వేతుడు అను రాజు ఉండేవాడు. అతనికి స్వామి ప్రసాదం అంటే,విపరీతమైన భక్తి ఉండేది.ఇంద్రద్యుమ్నుడు ఏర్పాటు చేసిన విధంగా స్వామికి నైవేద్యాలు సమర్పిసూ ఉండేవాడు. నిత్య పూజలు ఏర్పాటు చేసాడు.భోగాలు నిర్వహించేవాడు.  ఒక రోజున శ్వేతుడు ఉదయాన్నే స్వామి దగ్గర కు వెళ్ళి,ద్వారం దగ్గర నిలబడ్డాడు .తాను సమర్పించిన ప్రసాదాలను స్వామి స్వీకరిస్తాడా? అని సందేహించాడు.సింహాసనం దగ్గరకి వచ్చి చూశాడు.స్వామి లక్ష్మీదేవితో కలిసి ప్రసాదాన్ని స్వీకరించడం చూసాడు.

“ స్వామి! నీ దయను నాపై ప్రసరించు.నీ దగ్గర ఉండేటట్లు అనుగ్రహించు.నా రాజ్యంలో అకాల మరణాలు లేకుండా చూడు. సహజ మరణం పొందిన వారు ముక్తిని పొందేటట్లు చూడు.”అని శ్వేతుడు ప్రార్థించాడు.    ( 27 - 49 )

“శ్వేతా! నీవు కోరిన ప్రకారం అన్ని జరుగుతాయి.నా దక్షిణ భాగంలో నీవు ఉంటావు.నా ప్రసాదం స్వీకరించడం వలన నీవు రాజువు అయ్యావు. నీ పాపాలన్ని నశించాయి.ఇక్కడ ఉన్న వట వృక్షానికి,సముద్రానికి మద్య ఉన్న భాగంలో నా మొదటి అవతారం జరిగింది. అక్కడ నీవు స్ఫటిక రూపంలో వెలుస్తావు.శ్వేత మాధవుడవు అను పేరుతోనిన్ను కొలుస్తారు. ఈ ప్రదేశంలో మరణించిన వారు ముక్తిని పొందుతారు.దేవతలుకూడా ఇక్కడ మరణించాలని అనుకుంటారు. ఇక్కడికి ఉత్తర దిక్కున ఒక సరస్సు ఉంది. ఆ సరస్సులో స్నానం చేసిన వారు ముక్తిని పొందుతారు.నా ప్రసాదాన్ని తీసుకున్న వారికి అపమృత్యు భయం ఉండదు.

స్కాంద పురాణం లోని వైష్ణవ ఖండంలో చాతుర్మాస్య వ్రత దీక్ష అను ముప్ఫై ఏడవ అధ్యాయం సమాప్తం.

# మంచి మనసు

ఆదూరి హైమవతి

అనగనగా పూర్వం ఒకఅడవిలో ఒకపెద్ద మఱ్ఱి చెట్టు ఉండేడి. మొదట్లో ఆమఱ్ఱి చెట్టుపై ఒక కాకి గూడు కట్టుకుని వంటరిగా నివసించేది.దానికి వంటరిగా అలా ' ఒంటికయ సొంఠికొమ్ములా ' జీవించడం చాలా విసుగ్గా అనిపించింది.ఎలాగైనా చాలామంది స్నేహితుల్ని సంపదించాలని అనుకుంది. ఆవంటరి తనం భరించలేక కాకి తన అవ్వవద్ద కెళ్ళి అడిగింది కదా, "అవ్వా! అవ్వా! నాకు చాలామంది స్నేహితులు కావాలంటే ,ఏంచేయాలీ ! దయచేసి చెప్పవూ?“ అని. అవ్వనవ్వి, ఇలా చెప్పింది " పిచ్చి దానా! అదేమంత కష్టమైన పనేం కాదు. నీవు అందరినీ ప్రేమించి,అందరికీ సాయంచెయ్యి , ఎవ్వరినీ బాధించకు, ద్వేషించకు అప్పుడం తా నీస్నేహితులే అవుతారు."అంది.

వెంటనే కాకి అడవిలోకి వేగంగా వెళ్ళింది.అక్కడ కనిపించిన పిట్టలన్నింటినీ ప్రతిరోజూ పలకరించి, ఎవరికి సాయం అవసరమై నా అవి అడక్కుండానే చేయసాగింది.అడవిలో పిట్టలన్నీ కాకి సాయానికీ , దాని స్నేహ భావానికీ ఎంతో సంతోషించి , కాకితో స్నేహం చేయాలనుకున్నాయి.అంతే అన్నీ ఆపెద్ద మఱ్ఱిచెట్టు కొమ్మలపై గూళ్ళుకట్టుకుని నివసించ సాగాయి. కాకి వాటికి గూళ్ళు కట్టుకోను తన వంతుసాయం అందించింది. అన్నీ తమ కొత్త నివాసాల్లోకి వచ్చి చేరాయి.సమీపపు చెఱువు వాటి దాహం తీర్చుకోను సదుపాయంగా ఉంది. ఇప్పుడు కాకికి చాలామంది స్నేహితులు ఏర్పడ్డారు. రామచిలుకలు, కోయిలలూ, పావు రాలూ,పిచ్చుకలూ,వడ్రంగిపిట్టలూ , పాలపిట్టలూ, ఇంకా ఎన్నో కాకిని అభిమానించే స్నేహితులు .

ఆపక్షులన్నీ తమగూళ్ళలో ఆపెద్ద మఱ్ఱిచెట్టుపై ఎంతో స్నేహంగా ,కలసి మెలసీ నివసించేవి. ఆ మఱ్ఱిచెట్టు సమీపంలో ఉన్న చెఱువులో చాలా నీటిపక్షులూ ఉండేవి . కాకిది చాలా దయగల మనస్సు, ఎవరికేం అవసరం వచ్చినా కాకి వెళ్ళి సాయపడేది. అందుకే ఆనీటిపక్షులన్నీ కూడా కాకిని ప్రేమించేవి. తల్లిపక్షులు ఆహారంకోసం వెళ్ళినపుడు కాకి వాటి పిల్లలను జాగ్రత్తగా చూసేది. అందువల్ల నీటిపక్షులు సైతం కాకి అంటే ప్రాణం ఇచ్చేవి. ఒకరోజున ఒక వేటగాడు తరుముకురాగా ఒక నెమలి ఎంతోదూరం నుండీ పరుగెత్తుకువచ్చి ఆమఱ్ఱిచెట్టు నీడకు చేరింది, అది బాగా అలసి పోయి, ఆకలితోనూ దాహంతోనూ ఉంది. కాకి ఆ నెమలిని చూసి,

" ఓ నెమలమ్మా! బాగా అలసినట్లున్నావ్ !నీకు దాహానికి నీళ్ళు తేనా?" అని అడిగింది.

నెమలి అందికదా "ఔను దాహం కావాలి " అని. కాకి "మిత్రమా! నాగూటికిరా! నీకు నీరు, కొంత ఆహారం కూడా ఇస్తాను, నీవుమా అతిధివి." అని ఆహ్వానించింది.

నెమలి కాకిని ఏహ్యంగా చూసి,

" నేను ఎంతో అందంగా ఉన్నాను,నీవేమో నల్లగా అసహ్యంగా ఉన్నావు ,నేను నీ ఇంటికి ఎలారానూ? " అంది గర్వంగా. ఈమాటలు విన్నరామచిలుక వచ్చి " నెమలమ్మా!నీవునాకంటే అందగాఉన్నావా?” అంది. నెమలి " ఔను కావాలంటే నా

పింఛం చూడు, రంగులతో ఎంత అందంగా ఉందో!" అంటూ తన పింఛం విప్పింది. రామ-చిలుక " అబ్బా! ఎంత అందంగా ఉన్నావు!" అంది ఆశ్చర్యంగా. కోయిల దిగివచ్చి అడిగింది " ఇక్కడ ఏం జరుగుతోంది?" అని. చిలకమ్మ చెప్పింది " మన ని-వాసానికి ఒక అతిథి వచ్చింది, చూడూ ఆ పింఛం ఎంత అందంగా ఉందో!" వడ్రంగిపిట్ట దిగి వచ్చి అడిగింది ".ఇక్కడ ఏం జరుగుతోంది?" కోయిలచెప్పింది ." అందమైన నెమలి మన ని-వాసానికి అతిథిగా వచ్చింది. ఆ రంగుల ఈకలు చూడూ!" ఒక్కో-పిట్టా చెట్టుదిగి వచ్చి అడిగాయి ' విషయమేంటని ?' అవన్నీ నె-మలిపింఛం అందం చూశాయి . చెట్టు మీది పిట్టలేకాక , నీటిపి-ట్టలూ వచ్చాయి అక్కడికి. నెమలి పింఛం రంగుల అందంచూసి, ముచ్చట పడ్డాయి. మెచ్చుకు-న్నాయి కూడా! నెమలి వాటిని అడిగింది"మీరంతా నన్నుచూశా-రుకదా! నేనెంత అందంగాఉన్నా-నో! ఇప్పుడు చెప్పండి ఈ వికారపు కాకి నన్ను తన ఇంటికి విందుకు రమ్మంటే ఎలా వెళ్ళను?" పిట్టలన్నీ ఎంతో బాధపడ్డాయి. చిలకమ్మ " ఓమా నూతన స్నేహి-తుడా!నీవు కోయిలమ్మలా కమ్మగా పాడగలవా?" అంది. కోయిలమ్మ అడిగింది " నీవు చిలకమ్మలా మృధువుగా మాట్లాడ గలవా?వి-న్నమాటాలను తిరిగి చెప్పగలవా? ". " నీవు వడ్రంగి పిట్టలా చెట్లపై చిత్రాలు చిత్రించ వేయగలవా?" " పిచ్చుకమ్మలా మంచి గూళ్ళుక-ళాత్మకంగా కట్టగలవా?" " నైటింగేల్ పిట్టలా కమ్మని రాగాలు తీయగలవా?" " హంసలా అందంగా నడవగల-వా?" "పావురం తంబిలా శాంతి సందేశాలు తీసుకెళ్ళగల-వా?" "కొం-గమ్మలా నీటిలో ఒంటికాలిపై ఎంతో సమయం నిలువగలవా?" "బాతక్కలా నీటిలో వేగంగా ఈద-గలవా?", "ఆస్ట్రి-చ్అంకుల్ లా వేగంగా నేలపై నడవగలవా?" " డేగన్న-లా ఆకాశంనుండీ దూరపుచూపు చూడగలవా?" " పాలపిట్టలా చీకటిలో చూ-డగలవా?" పిట్టలన్నీ నెమలిని తలోప్రశ్న వేశాయి. "కనీసం నీవు కాకమ్మలా అందరినీ ప్రేమించగలవా? కాకి ఎప్పుడూ వంటరిగా తినదు.నీవు అందంగా ఉండవచ్చుకానీ నీ హృదయంలో దయ, కరుణ, ప్రేమ ,స్నేహభావన లేనేనేవు. దయగల హృదయమే దైవ-మందిరం.శరీరాకృతి అందంగా ఉంటే ఏం లాభంచెప్పు!వేటగాడు నీపింఛం చూసి నిన్ను చంపాలని వెంటాడితే నీవు ప్రాణ రక్షణకోసం పరుగెట్టి ఇక్కడికి చేరావు! దయ, కరుణ లేని అందం ఏంచేసుకో-ను?నీ అలసట చూఇస్ దాహం కావాలా? అని అడిగిన కాకమ్మను నిర్ధ్యాక్షిణ్యంగా అవమానించావు." అని అడిగింది పక్షులరాజు గ్రద్ద. నెమలి ఈ మాటలన్నీవిని సిగ్గుతో తన గర్వానికి విచారించింది. వెక్కి వెక్కి ఏడ్చింది." ఓ మి-త్రులారా! నన్ను మన్నించండి. పొగరుగా మాట్లాడి ఆదరించ వచ్చిన కాకమ్మను బాధించాను. దయతో నన్నూమీతో ఉండని-వ్వండి, మీరన్నట్లు నాపింఛం అందగా ఉందని గర్వించాను, నాస్వరం అసహ్యంగాఉంటుంద-ని మరచాను.మన్నించండి"అని అందర్నీ తలవంచి అడిగింది. కాకమ్మ ముందుకు వచ్చి " స్నే-హితులారా! మన కొత్త నేస్తం ఆకలితో ఉంది.దాహంగా ఉంది, అలసి ఉంది.మాటలు ఆపి రండి విందుచేద్దాం. " అనిపిలిచింది.

పిట్టలన్నీ నెమలిని ఆహ్వా-నించాయి. గ్రద్ద నెమలితో" నెమలి మిత్రమా!చూడూ కాక-మ్మని!ఎప్పుడూ ఆమె ఇతరులకు సాయం చేయాలనే ఆలోచిస్తుం-టుంది. ఎంత మంచి మనసో చూశావా? కాకమ్మ నుంచీ మన మంతా ఈ మంచి గుణం నే-ర్చుకోవాలి." కాకమ్మ నెమలితో " మిత్రమా!నీకు ఇంత అందమైన పింఛం ఉందికదా! నీవు నృత్యం నేర్చుకుని పురివిప్పి ఆడావంటే ఎంత అధ్భుతంగా ఉంటుందో-కదా!" అని ప్రోత్సహించింది, విం-దుసమయంలో. నెమలి నృత్యం నేర్చుకుంది. నృత్య రాణిగా పేరు తెచ్చు కుంది. ఆతర్వాత భారత జాతీయపక్షిగా గుర్తింపుపొందిం-ది. కాకి ప్రోత్సాహమేదానికి అంత గొప్ప గుర్తించుతెచ్చింది.

నీతి-- మనకు సేవాభావనఉం-టే ,అందరూ మనకుమిత్రులవు తారు. పైకి కనిపించే అందం గురించీ గర్వించరాదు.అది అశా-స్వతమైనది.అందరినీ ప్రేమించే మంచి మనసూ కలిగి అవస-రమైనవారిని సేవించడం మన ధర్మం .

# గురువులు

(9వ పేజీ తరువాయి)

"వాట్? ఎవరి దగ్గరా పని చెయ్యలేదా? మరి ట్యూన్ కి పాట రాయటం ఎలా వచ్చిందీ?" ఆశ్చర్యంగా అడిగారు.

'దహియా' వృత్తాంతం చెప్పాను.

ఇంతకీ చెప్పుకొచ్చేదేమిటంటే, పాట రాయటం నాకు నేర్పిన గురువు ఎవరూ? దహియా నా? కాదే. నాలోని అభిమానమా? కాదే. ఇప్పుడిప్పుడే నాకు తెలుస్తోంది. నాకు పాట రాయటం నేర్పిన గురువు 'కాలం'

కాలాన్ని మించిన గురువు సృష్టిలో మరొకరు లేరు. అనేకానేక రూపులతో మనని మలిచేది కాలమనే గురువే. ఏ క్షణంలో ఎలా ప్రవర్తించాలో నేర్పేదీ కాలమనే గురువే. అందుకేనేమో కాలాయ, కాలకాలాయ, కాలరూపాయ అంటాం.

నిరంకార, నిరంజన, నిర్గుణ, నిర్మల గురుస్వరూపమే కాలం. గురువు కాలానికి అతీతుడు గనకనే, కాల-రూపుడై మనని నడిపిస్తున్నాడు.

ప్రతి శ్వాసా ఒక గురువే.

ప్రతి నిశ్వాసా ఒక గురువే.

అజ్ఞానమనే చీకటిని అనుక్షణం తొలగిస్తూ, యీ శరీరమనే శకటాన్ని ముందుకు నడిపిస్తున్న 'అజ్ఞాత' గురువులకి పాదాభివందనాలర్పిస్తూ,

మీ భువనచంద్ర

# గోవింద గురుస్వామి మఠం ___పలుగురాళ్ళపల్లె



నందుల ప్రభాకరశాస్త్రి

కడప జిల్లా అంటే ఇప్పుడందరికీ కత్తులూ, కఠార్లూ, బాంబులు నరుక్కోవడాలు, చంపుకోవడాలు--- పగలు, ప్రతీకారాలు మాత్రమే అనేవిధంగా సినిమాలలో చూపించి డబ్బులు దండుకుంటున్నారు. కానీ వాస్తవానికి కడప జిల్లా బాంబుల గడ్డ కాదు. ఫ్యాక్షన్ కు అడ్డాకాదు, అత్యంత మృదువైన, సున్నితమైన, స్నేహ సౌహార్ద్రాలకు, నిజాయితీకి పుట్టినిల్లు.

తిరుపతి శ్రీవేంకటేశ్వరుని చేరుకోవడానికి మొదటి "గడప" ఈ "కడప". సాహితీ దిగ్గజాలు, కవులు, కళాకారులు, అష్టావధానులు, శతావధానులు, ఆధ్యాత్మిక వైతాళికులు, సిద్ధగురువులు, సాధకులు, ప్రవచన కర్తలు పుట్టిన పుణ్యభూమి "ఈకడప" జిల్లా.

కడపజిల్లా "బ్రహ్మంగారి మఠం" సమీపానగల పలుగురాళ్ళపల్లెలో జీవ సమాధి పొందిన " శ్రీగోవిందగురుస్వామి" అలాంటి మహనీయులలో సుప్రసిద్ధుడు. 17_18 శతాబ్దంలో ఈ యోగి పుంగవుడు ఇక్కడ నివసించారని తెలుస్తుంది. ప్రస్తుతం సిద్ధయ్య గారి మఠం వున్న ఊరు

" ముడమాల" లో నివసిస్తున్న శ్రీ యాదాటి పార్వతమ్మ, రామచంద్రభట్టు అనే వైదిక దంపతుల పెద్ద కుమారుడే ఈ "గోవిందగురుస్వామి".

మహాత్ముల రాక అరుదుగా జరుగుతుంది. బాహ్య ప్రపంచ సౌకర్యాలకో భౌతిక సుఖాలకో బానిసలు కారు . బాలగోవిందయ్య ఊయలలో ఊగుతున్న సమయంలో తలవైపున ఒక భయంకరమైన ఘట సర్పం పడగవిప్పి ఆయనకు గొడుగులా పట్టిన దృశ్యాన్ని చూసి తల్లిదండ్రులు ఆశ్చర్య పోయారు. చిన్న నాటి నుండే వీరి చర్యలు మిగతా పిల్లలకు భిన్నంగా వుండేవి. అందరూ ఆడుతూ పాడుతూ కేరింతలు కొడుతూవుంటే........బాలగోవిందయ్య మాత్రం ఊరి చెరువు గట్టుకు వెళ్ళి బంకమట్టి తో పళ్ళెం చేసి , అయిదు రకాల "గులకరాళ్ళను" "పంచాయతన"దేవతలుగా సమర్చి , తెల్ల సుద్దరాయి పొడిని విభూతిగా ధరించి, ఎఱ్ఱటి రాళ్ళ పొడిని కుంకుమగా పెట్టుకొని, గడ్డి పూలను పూజా పుష్పాలుగా చేసుకుని, గడ్డి వెన్నులను అక్షతలుగా చేసుకొని , చెరువునీళ్ళతో అభిషేకం చేసి , తుంగ గడ్డలు నైవేద్యంగా సమర్పించి ," ప్రకృతే పరమాత్మ, పరమాత్మయే ప్రకృతి " అని ప్రబోధించినవారు "శ్రీగోవిందగురుస్వామి" వారు.

ప్రకృతి ఆరాధ్యులైన "గోవిందయ్య" గారు ఆనాడే మానవాళికి ఒక చక్కటి సందేశమిచ్చారు " ప్రకృతిని కాపాడు కోండి__అది మిమ్ములను కాపాడుతుంది " అని. కానీ విజ్ఞానం పేరుతో పెరిగిన అజ్ఞానం తో ప్రకృతిని తమ అధీనంలో ఉంచుకోవాలని, ఈనాడు మన ఈ దుస్థితికి మనమే కారణభూతుల మయ్యాము. ఇన్ని అనర్థాలకు, కడగండ్లకు మనమే సమాధానం చెప్పుకోవాలి. మహాత్ముల మార్గం ఇప్పటికైనా మనం పాటించక తప్పదు.

అభౌతికానందం పొందుతూ పెద్ద-వాడవుతున్న "గోవిందయ్య" గారు "గరుడాద్రి సూరయ్య " అనే సద్గురువు వద్ద మంత్రం నేర్చుకుని, దగ్గర లోనున్న " ముచికుంద" అన్న పేరుగల గుహలో సాధన చేయటం ప్రారంభించారు. యుక్త వయస్సు రాగానే తల్లిదండ్రులు లక్ష్మమ్మ తో వివాహం చేశారు. " సంసార సాగరాన్ని " ఈదలేనివాడు " భవసాగరాన్ని" ఏమీదగలడు? ఒకవైపు సంసార జీవనాన్ని సాగిస్తూ "ఋతుంభర" మున్నగు యోగ సాధనలు చేయటంలో, సాధించటంలో సిద్ధి పొందారు.

ప్రముఖంగా "ఋతుంభర" ప్రజ్ఞా యోగ విద్య ద్వారా అనేక శక్తులు సాధించారు. "ఋతుంభర" అంటే అనంతమైన చేతనాంభుధి. మనసు కు గొప్ప "ప్రజ్ఞను" "జ్ఞానాన్ని" ప్రసాదించగల విద్య. ఈవిద్య భౌతిక సంబంధమైనది కాదు. ఇది సహజాతమైనది. అంతరంగ పెన్నిధిలో నిక్షిప్తమై న ఈ ప్రజ్ఞను తట్టి లేపడం చేశారాయన. ప్రకృతిలో భాగమై ఉంటుందీవిద్య. "ఋతం" అంటే "సత్యం", ..."భర" అంటే "నిండినది" అని. మనసు, ఆత్మ, శరీరం అంతా

"సత్యం" తో నిండినది. తథాత్మ్యంలోనిండినది. యథా తథ్యమైనది, అచ్చలమైన విద్యను సాధించారు "గోవిందగురుస్వామి" గారు.

ఇలా అనేకమైన యోగ విద్యలను సాధించి, తన భౌతికావసరాలకు ఉపయోగించ కుండా కేవలం ప్రజా బాహుళ్యానికి ఉపయోగించేవారు. ఆనాడు కాశీనుండి రామేశ్వరం పోయే భక్తాదులకు ఆయన ఆతిథ్యం ఇచ్చేవారు. ఏసమయానికి ఎంతమంది వస్తారో

తెలియదు. అందుకై పదిమందికని వండిన వంటకాలను అభిమంత్రించి వందలమందికి సరిపోయేవిధంగా చేసేవారు. మహాత్ముల జీవితాలు ప్రజాక్షేమానికే అంకితంకదా !

"గోవిందస్వామి"కి చుట్టు ప్రక్క పల్లెల్లో అనేకమంది శిష్యులుండేవారు. పలుగురాళ్ళ పల్లె కేంద్రంగా తనకార్యకలాపాలను, సాంసారిక, పారమార్థిక, జీవితాన్ని కొనసాగించారు. స్వామివారు అనేక మహిమలను కలిగియుండేవారనటానికి రెండు ఉదాహరణ లు చెప్పవచ్చు.

స్వామివారు శిష్య పరివేష్టితులై యుండగా ఒక్క క్షణం ధ్యానంలోకి వెళ్ళి హఠాత్తుగా గర్జించారట. భయభ్రాతులైన శిష్యబృందం ఏం జరుగుతుందో తెలియక తికమక పడ్డారట. యథాతథ స్థితికి వచ్చిన స్వామి వారిని శిష్యులు అడుగగా జరిగిన విషయం చెప్పారట. నల్లమల అడవిలో మేస్తున్న తమ కామధేను గోమాత మీద పులి లంఘించడం ధ్యానంలోనుండి

గమనించిన స్వామి వారు ఆ పులిని తమ "హుంకారంతో " పారద్రోలినారట. ఈవిషయం విన్న శిష్యులు నివ్వెరపోయారు. సాయంత్రానికి పశువుల కాపరులు తిరిగివచ్చి , ఆవుపై పులి చేసిన దాడికి గీరుకుపోయిన పులి గోళ్ళ గుర్తులు , రక్తపు మరకలు చూసి శిష్యులకు నోటమాటరాలేదట. పులి దాడిచేసిన సమయం స్వామి వారు "హుంకరించి" పులిని పారద్రోలిన సమయం ఒక్కటేనని

పశుల కాపరులు చెప్పడంతో మరోసారి నివ్వెర పోయారట. మహాత్ముల లీలలు అలాగే వుంటాయ్.

స్వామివారి మరోమహిమ చెప్పుకోదగిన ది, కడపజిల్లా కలెక్టరుగారు "జమాబందీ" అంటే పన్నులు వసూలు నిమిత్తం మైదుకూరులో క్యాంపులో వుండగా, గ్రామాధికారు లందరూ కలెక్టరుగారితో మంతనాలు జరుపుతున్న సమయం. "గోవిందస్వామి". వారు ఆదారిలోనే వారి ఎదుట అదేవీధిలో పోతూ ...." అయ్యో...అయ్యో..." అంటూ చేతులు పిసుక్కుంటూ సంతాప వచనాలు పలుకుతూ వెళుతున్నారట. "గోవిందస్వామి" ని

గురించి తెలిసిన ఆ గ్రామాధికారులందరూ ఆయనవైపు తిరగటంతో స్వామిని గుఱించి కలెక్టరు గారు అడిగి, ఆయన అలా అనటానికి కారణం తెలుసుకోమన్నారట. గోవిందస్వామి గొప్పతనం కలెక్టరుగారికి వివరించారట. కారణం స్వామివారిని అడిగారట.

అందుకు స్వామి వారు, "కంచి వరదరాజస్వామి వారి పటం ( తెరపై చిత్రించినది) కాలిపోతూ వున్నది" అన్నారట. అందుకు కలెక్టరువారు "ఆ "తెరపటం" ఇంకా కాలుతూ వుందా?" అని అడిగారట. స్వామివారు "అవును" అని సెలవిచ్చారట. వెంటనే కలెక్టరువారు చెంగల్పట్టు మండలాధికారికి టెలిగ్రామ్ (తంతివార్త) పంపితే ఆవార్త సత్యమని తేలిందట. స్వామివారి అద్భుతమైన శక్తికి ఆశ్చర్యపడ్డ కలెక్టరుగారు స్వామివారికి ప్రొద్దుటూరు రామేశ్వరం దగ్గర గల "దొరసాని పల్లెలో" మూడెకరాల భూమిని పారితోషికంగా సమర్పించు కున్నారట.

స్వామివారు ఎన్నోమహిమలను ప్రదర్శిస్తూ అనేకమంది శిష్యులకు ఆధ్యాత్మిక దారిచూపుతూ దగ్గర దగ్గర నూరు సంవత్సరాలు భౌతిక శరీరం లో నివసించారు. వీరు శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి వారి కంటే వయసులో కొంచం చిన్నవారు, ముడమాల సిద్ధయ్యస్వామి గారికంటే పెద్దవారు. కుల, మత, జాతి, ధనిక, పేద, గొప్ప ....... ఇలాంటి భౌతిక విషయాలకు విలువ నీయక అందరినీ చేరదీసి తనను ఆశ్రయించిన వారి కందరికీ ఆధ్యాత్మిక బోధచేసి శిష్యులకు ఆరాధ్య దైవమయ్యారు. స్వామి శుశ్రూష చేసి తత్వోపదేశం పొందిన అనేక మంది శిష్యులు గొప్ప రచయిత లైనారు. తత్వవేత్తలైనారు. జీవన సాఫల్యం పొందారు.

భౌతిక ప్రపంచానికి తమ రాకపోకలు తెలిసినవారు కాబట్టి తమ జీవ సమాధికి సమయమాసన్న మైనదని తెలుసుకొని కాశీకి పోయి శివలింగం తెచ్చినారు. మఠంలోనే ప్రతిష్ఠించారు . ఈ ఆలయమే " మీనాక్షీ నర్మదేశ్వరుల " ఆలయం.

కుల వివక్ష నిర్మూలనలో , స్త్రీ , పురుష వివక్షకు వ్యతిరేకంగా అర్హులైన ప్రతియొక్కరికీ బ్రహ్మోపదేశం చేశారు. వీరి శిష్యులలో "రామమ్మ" అనే మహిళ, "రామయ్యరెడ్డి" అనే ఆయన స్వామివారి దగ్గర ఉపదేశం పొంది అరిషడ్వర్గములను గెలిచి ముచికుంద గుహలో యోగంలో వుండి అష్టాంగయోగం సాధించారని తెలుస్తూంది.

గోవిందగురుస్వామి వారి శిష్యుడు " రామావఝుల కొండు భట్టు " " కపిలగోసంవాదం " అనే ఆరు ఆశ్వాసాల గ్రంథం రచించాడు. కందుకూరి వీరేశలింగం పంతులు గారు తమ కవుల చరిత్ర (1895) మూడవ భాగంలో ఈ అముద్రిత గ్రంథము నుండి ఆరు పద్యాలు ఉదహరించారు. సంఘసంస్కర్తగా గోవిందగురుస్వామి చిరస్మరణీయుడు.

గోవిందగురుస్వామి వారిది స్వేచ్ఛామరణం. సన్యాసాశ్రమం స్వీకరించిన తర్వాత శుభతిథి నాడు తాము జీవసమాధి అవుతున్నామని ప్రకటించారు. శిష్యుల కోరిక మేరకు మరో ఆరు రోజులుండి కొడుకు పెండ్లి కార్యక్రమాలు ముగించి జీవసమాధి అయినారు. పరమ శాంతమూర్తులు, సత్యవచనులు, అద్వైత సిద్ధాంత ప్రచారకులు, ప్రస్థానత్రయ భాష్య కారులు, పితృణం కొఱకు గృహస్థు గా మారిన యోగిపుంగవుడు, ఆతరువాత దండియై, శార్దూల చర్మంపై, కుశికాసనం వేసుకుని , చిన్ముద్ర ధరించి , ఆత్మావలోకనం చేస్తూ 17-12-1750 నాడు అంటే మార్గశిర అమావాస్యనాడు జీవసమాధి పొందారు. కానీ వారి ఆజ్ఞానుసారం తమకు గురూపదేశం జరిగిననాడు, అంటే మాఘ పూర్ణిమ నాడు మాత్రమే ఆరాధనోత్సవాలు నిర్వహించాలన్నారు.

ఈనాటికీ ఆయన శిష్యపరం-









పర అనేకులు ఆయనను తమ గురువుగా దేవునిగా భావించి మఠప్రాంగణంలో నిద్రలు చేస్తూ, సంతాన ప్రాప్తి కొరకు మొక్కులు మొక్కుతూ తమ సంతానానికి గోవిందయ్య, గోవిందమ్మ, గోవిందుడు, గోవిందరెడ్డి, అని పేర్లు పెట్టుకుంటూ తరిస్తూ వుంటారు.

తరాలు మారుతూ వున్నాయి, అంతరాలు పెరుగుతూ వున్నాయ్, అంతరాంతరాలలో స్వార్థం చోటు చేసుకుంటూ వుంది. భౌతికావసరాలు , భౌతికానందాలు, పెరుగుతున్నాయ్, అంతరంగ శూన్యం ఏర్పడుతూంది, మహనీయులు, ప్రాభవాలు తగ్గుతున్నాయ్ వేషధారుల వలయంలో చిక్కుకుంటున్నారు, శతాబ్దాలనాటి వైభవం సన్నగిల్లింది, మఠంలో

ఒకప్పుడు "సన్యసించిన" వారుంటే ఇప్పుడు "సన్నాసులు" వుంటున్నారు.

అన్నిటిని అపవిత్రం చేయడమే లక్ష్యంగా సాగుతూంది. అయినాకానీ "గోవిందగురుస్వామి" మఠాధిపతులు స్వామినే నమ్మి కటిక దరిద్రాన్ని చవిచూస్తూకూడా నియమం తప్పక తమ విధి తాము నిర్వర్తిస్తూ వస్తున్నారు.

మఠానికైనా, మనిషికైనా చీకటివెలుగులు సహజం. వెలుగొచ్చినపుడుపొంగకుండా, చీకట్లొచ్చినపుడు కృంగిపోకుండా , ఆరెండూ మనవి కావు , చీకటి వెలుగులు ప్రకృతి సహజాలని సమభావం నేర్పేదే "ఆధ్యాత్మికత" , అదే పాటించారు మఠాధిపతులు.

ఆరు తరాలతర్వాత ఏడవతరంలో యాదాటి శ్రీనివాస శర్మ గారి పర్యవేక్షణలో శ్రీగోవిందగురుస్వామి వారి మఠం పూర్వ వైభవం సంతరించుకుంది. తాను "లండన్ " మహానగరంలో సాఫ్ట్ వేర్ ఉద్యోగం చేస్తూ శని ఆదివారాలలో అక్కడ" పౌరోహిత్యం " నిర్వహిస్తూ, తద్వారా వచ్చిన ఆదాయాన్ని మఠం పునరుద్ధరణకు ఉపయోగించి ప్రతిసంవత్సరం ఆరాధనలు, నిత్యపూజలు, జరిపిస్తూ , అన్యాక్రాంతమైన మఠం భూములను తిరిగీ మఠం స్వంతం చేసి దూరమైన భక్త బృందాన్ని ఒకచో చేర్చి, " యాదాటి గోవింద స్వామి ట్రస్ట్" స్థాపించి, భక్తుల నుండి, మిత్రుల నుండి విరాళాలుసేకరించి పూర్ణ పూర్వ వైభవాన్ని తీసుకు వచ్చారు. ప్రస్తుతం మఠం కళకళ లాడుతూ వుంది.

సంప్రదించాలనుకున్న వారు " యాదాటి గోవిందగురుస్వామి ట్రస్ట్" " www.yadati.org " ను సంప్రదించ వచ్చు.

# కారణ జన్ములు .... సరస్వతీ అవతారం ...
# శ్రీ మంగళంపల్లి బాలమురళీ కృష్ణ

తీగవరపు శాంతి

1930 జులై 6వ తేదీన ఆషాఢ శుద్ధ ఏకాదశి నాడు తూర్పు గోదావరి జిల్లా రాజోలు తాలూకా శంకరగుప్తం లో పట్టాభి రామయ్య, సూర్యకాంతం దంపతులకు జన్మించారు.

సరస్వతీదేవికి భూలోకానికి రావాలనే కోరిక తీర్చుకోవడానికి ఇలాంటి మహానుభావులకి జన్మనిచ్చి, మనల్ని ఇలాంటి పుంభావ సరస్వతి సంగీతం ద్వారా మనల్ని ఆనందపరుస్తుంది. ఇంతటి గొప్ప మహానుభావుల కుటుంబంలో "మంగళంపల్లి" పుట్టింటి పేరుతో ఆ కుటుంబంలో పుట్టడం, చిన్నప్పటి నుంచి మాకు వారితో సన్నిహిత సంబంధాలు ఉండడం ఒక అదృష్టంగా భావిస్తాను. బంధుత్వంలో వరుసకు నాకు బాబాయి. మా నాన్నగారి కంటే ఒక సంవత్సరమే చిన్న అవడం, ఆయనకీ తల్లి, మా నాన్న గారికి తండ్రి లేకపోవడంతో ఇద్దరు చాలా సన్నిహితంగా ఉంటూ, ఎక్కడ కచేరీ అయినా ఇద్దరూ వెళ్ళేవారుట. వాళ్లిద్దరూ కజిన్స్. అలా అలా మా కుటుంబంతో కూడా సంహితంగా ఉంటూ, అమలాపురంలో ఎప్పుడు కచేరీ అయినా మరునాడు ప్రొద్దుటే వాళ్లంతా మా ఇంటికి వస్తే బాబాయికి ఇష్టమైన



నేతి పెసరట్టు, ఉప్మా చేసి అమ్మ పెట్టేది. వదినా అంటూ ఎంతో ఆప్యాయంగా తింటూ, కాసేపు మా అందరి చదువులు గురించీ అడిగేవాడు. అలాగే మా వివాహం అయ్యాక కూడా నేను మావారు చెన్నై వెళ్ళినప్పుడు ఆయన ఇంటికి వెళ్లి కలిసే వాళ్ళం. చాలా ఆప్యాయంగా మా పిన్ని(బాల మురళీ భార్య ) బాబాయ్ ఉండేవారు. అలా వెళ్ళినప్పుడు ఒక సారి వాళ్ళిద్దరి తోనే కాక, కూతురు, మనవరాలితో కూడా ఇంటర్వ్యూ చేసి, మన పత్రికలో వెయ్యడం జరిగింది.

ఇక నేను ఫోన్ లో కూడా మాట్లాడుతూనే ఉండేదాన్ని. నాకు చాలా చనువు బాబాయితో అనే చెప్పాలి.

మా నాన్నగారి కుటుంబంలో చాలా మంది సంగీత విద్వాంసులు, జ్యోతిష్యం, అలాగే కవులు ఉండేవారు. మా నాన్న గారు వాస్తు, జ్యోతిష్యం. ముఖ్యంగా ఈ పత్రిక ఇలా నడుపుతానని మా నాన్నగారు నా చిన్నప్పుడే చెప్పారు. మా పిల్లలకి కూడా

(42 వ పేజీ చూడండి)

# దేవదేవుని పంచ భూత లింగాలు

# అగ్ని లింగం ` అరుణాచలం




కొత్త రామానందం



అగ్నిలింగం అరుణాచలేశ్వరుడిగా ఆవిర్భవించడానికి నాంధీ ప్రస్థావన` మొదటి కల్పంలో బ్రహ్మ విష్ణువుల మధ్య అహంకారపూరిత వాగ్వివాదం వల్ల జరిగినట్లు స్థలపురాణం. ఒకసారి బ్రహ్మవిష్ణువులు పరస్పరం తాము గొప్పంటే తాము గొప్పంటూ కలహించుకుంటుండగా, హఠాత్తుగా వారి మధ్య నలుదిక్కులనూ తేజస్సుతో నింపివేస్తూ ఒక జ్యోతి స్థంభరూపంలో ఆవిర్భవించింది. బ్రహ్మవిష్ణువులు ఘర్షణ మానేసి ఆ జ్యోతిస్థంభం వైపు ఆశ్చర్యంగా అయోమయంగా చూస్తూ ఉండిపోయారు. ఇది ఎక్కడ నుంచి వచ్చింది. దీని తుది, మొదలు ఎక్కడ అని ప్రశ్నించారు. ప్రత్యక్షమయిన శివుడు ఆ వివరాలను వారిద్దరినే తెలుసుకోమన్నాడు. బ్రహ్మదేవుడు హంస రూపంలో పైకీ, విష్ణువు వరాహ రూపంలో కిందికి పయనించారు. వారు ఎంత దూరం వెళ్ళినా ఆద్యంతాలు కనరాలేదు. ఇద్దరూ తుది మొదలు కనుగొనలేక తిరిగి వచ్చేస్తారు. విష్ణువు శివునితో వినయ పూర్వకంగా తాను అగ్ని- = చూడలేకపోయానని విన్నవించుకున్నాడు. బ్రహ్మదేవుడు అగ్నిలింగం ఉపరితలాన్ని చూచానని, అందుకు సాక్ష్యం అక్కడ ఉన్న మొగలి పుష్పమని అబద్ధం పలికాడు. దీనితో శివుడు బ్రహ్మ యొక్క ఐదవ శిరస్సు ఖండిరచమని కాలభైరవునికి ఆజ్ఞాపించాడు. కానీ అక్కడ చేరిన దేవతలు అందరి ప్రార్ధన మన్నించి బ్రహ్మను క్షమించాడు కాని అతని అబద్ధానికి శిక్షగా బ్రహ్మకు ఎక్కడా ఆలయం ఉండదని

తీర్మానించాడు. అయినప్పటికి బ్రహ్మ పశ్చాతాపానికి కరిగిపోయి, అతని మీద ప్రేమతో ఏ యజ్ఞమైనా అతని ప్రస్థావన లేకుండా పరిపూర్ణం కాదని వరమిచ్చాడు. దేవతలు శివుని ప్రార్థించి నిన్ను సేవించుకునే అవకాశం మాకు ప్రసాదించు అని కోరగా శివుడు అదే ప్రదేశంలో పర్వతాకారంగానూ, లింగ రూపంలోను ఉంటాననీ తన లింగాకృతిని మీరందరూ పూజిస్తే కొంతకాలానికి ఆ లింగం నుంచి తను రుద్రుడిగా వెలువడి అందరిని అనుగ్రహిస్తాననీ చెప్పాడు. ఆయన చెప్పినట్లు ధనుర్మాసంలో ఆరుద్ర నక్షత్రంనాడు జ్యోతిర్లింగమైన అరుణగిరి స్వయం భూలింగం అవతరించింది. శివుడు చెప్పిన పద్ధతిలోనే బ్రహ్మాదులు ఆ లింగాన్ని పూజించారు. అప్పటినుంచి లింగార్చన ప్రారంభమైంది. అరుణాచలం ప్రాశస్త్యం గురించి అనేక పురాణాల్లో ప్రస్థావన ఉంది. గౌతముడు, అగస్త్యుడు మొదలైన మహర్షులు ఈ గిరిని శోణాచలమని కీర్తించారు. 43 కోణాలున్న శ్రీ చక్రాకారంతో విలసిల్లే సుదర్శన గిరి` అరుణగిరి. అందుకే దీన్ని శంకరులు మేరువు అన్నారు. అరుణాచలం కొండపై ఉన్న గృహాలన్నీ తపోవనాలు. కొండంతా నిండి ఉన్న అనేక దివ్య ఔషధ వృక్షాలు, సాధుకుడికి శారీరక ఆరోగ్యాన్ని అనుగ్రహిస్తాయి. భగవాన్ రమణుల ప్రేరణతోనే అరుణాచల గిరి ప్రదక్షిణ ప్రసిద్ధకెక్కిందని అనవచ్చు. అరుణాచల ప్రదక్షిణం శివ పార్వతులకు చేసే సాక్షాత్ ప్రదక్షిణతో సమానమని ఆయన పేర్కొన్నారు. అరుణాచలమే శివుడని రమణులు చెప్పిన అంశాన్ని సాధనా మార్గంలో మాత్రమే దర్శించగలరు. ఈ పర్వతం ఎత్తు 2668 అడుగులు. నేలపై చుట్టు కొలత 14 కిలోమీటర్లు. అందుచేత ఈ గిరి ప్రదక్షిణం చేస్తే పూర్ణ శివలింగా ప్రదక్షిణ చేసిన ఫలం వల్ల భక్తులకు ముక్తి లభిస్తుందనీ, దీని చుట్టూ అనేక పవిత్ర స్థలాలు ఆవిర్భవించి భక్తులకు ఐహిక ఆముక్తిక ఫలాలు ప్రసాదించగలదని శివుడు వరమిచ్చాడు. ఈ ప్రదేశంలో చేసిన పూజలు, దానాలూ అనేక రెట్లు ఫలితాలునిస్తాయి. ఈ ప్రాంతంలోని ప్రతీలింగం,





ఆలయం, ఆశ్రమం, పుష్కరిణి, చివరకు ప్రతిరాయి కూడా పవిత్రమైనది. కాబట్టి గిరి ప్రదక్షిణం చేసేటప్పుడు చెప్పులు లేకుండా తిరగాలి. ప్రదక్షిణ సమయంలో నిశ్శబ్దం పాటిస్తూ, భక్తి పూర్వక కీర్తనలు గానీ, భగవన్నామాన్నిగాని ఉచ్ఛరిస్తూ సాగిపోవాలి. రమణ మహర్షి ఆశ్రమం కుడివైపు నుంచి బయలుదేరి కొండను చుట్టి తిరిగి ఆశ్రమానికి రావడం గిరి ప్రదక్షణలో ఆనవాయితీగా వస్తుంది. ప్రదక్షిణ మార్గంలో వినాయక ఆలయం వద్ద నిలబడి చూస్తే అరుణాచలం నందీశ్వరునిలా కనిపించడం యాత్రకులందరికి అనుభవంలోకి వస్తుంది. భక్తులు అందరూ విశేష సంఖ్యలో పగటి వేళల్లో ఉదయం 9గం॥ లోపుగా ప్రదక్షిణ ముగిసేలా జాగ్రత్త పడతారు. సాయంత్రం 5గం॥ నుండి ప్రదక్షణ ప్రారంభిస్తారు. రాత్రిపూట, తెల్లవారుజామున గిరిప్రదక్షణ చేయడానికి వీలుగా విద్యుద్దీపాలు ఏర్పాటు కూడా ఉంది. ఈ గిరి పరిక్రమ పౌర్ణమినాడు, గ్రహణంనాడు చేస్తే విశేష ఫలితం లభిస్తుందని నమ్మకం. ఆరోగ్యరీత్యా కాలినడకను వెళ్ళలేనివారు ఏదైనా వాహనంపై వెళ్ళవచ్చు గాని, ప్రదక్షిణ మానుకోవలసిన అగత్యం లేదు. ఈ పరిశ్రమ చేయదలచినవారు స్నానం చేసి, పరిశుభ్రమైన తెల్లని వస్త్రాలను ధరించి, విభూది, కుంకుమధారణ చేసి, కాళ్ళకు చెప్పులు లేకుండా శక్తికొలది ధానధర్మాలు చేస్తూ నెమ్మదిగా నడవాలి. గిరిప్రదక్షిణ చేస్తున్నప్పుడు భక్తి భావం పొంగాలి. అనేక లింగాలు, తీర్థాలు, ఆశ్రమాలు, ఆలయాలు గిరి వలయములో సందర్శించే అవకాశం లభిస్తుంది. సాధకుణ్ణి అంతర్ముఖుణ్ణి చేసి, జ్యోతిర్మయమైన వెలుగును ఆత్మ స్వరూపంగా దర్శింపజేసే అద్భుత అనుభూతి. అనేక పురాణాలలో ఈ అరుణగిరి విశిష్టతను గురించి లిఖించబడిరది. కృత యుగంలో 'అగ్ని పర్వతం' త్రేతాయుగంలో 'రత్న పర్వతం' ద్వాపరయుగంలో 'కంచు పర్వతం' గా ఉన్న ఈ అరుణగిరి. ఈ ప్రస్తుత కలియుగంలో 'శిలా పర్వతం'గా రూపు చెందినట్టు పురాణ కథనం. ఆలయ సందర్శనం: పరమశివుడు స్వయంభువుగా వెలసిన క్షేత్రాన్ని అరుణాచలం అని పిలుస్తూంటారు. తమిళంలో తిరు అంటే శ్రీ అణ్ణాళ్ అంటే అగ్ని. మలై అంటే పర్వతం అని అర్థం. కాబట్టి తిరువణ్ణామలై అంటే శ్రీయుతమైన అగ్ని పర్వతం అని అర్థం. తిరువారూర్‌లో జననం, కాశీలో మరణం, విల్లమ్ (ఆడంబరం)



లో దర్శనం, తిరువణ్ణామలైస్మరణం మోక్షదాయకం. ఓ తమిళ సూక్తి. అలాగే వీలైనప్పుడల్లా 'ఓం' అరుణాచలేశ్వరాయనమ: అనే మంత్రాన్ని జపిస్తే అన్ని రకాలైన బాధల నుంచి విముక్తి పొందుతామన్నది పెద్దలవాక్కు. నాడు పాండవ మధ్యముడు అర్జునుడు, అగస్త్యమహర్షి, స్వామివారిని దర్శించుకుని అభీష్ట సిద్ధిని పొందగా, ఈ యుగంలో రమణ మహర్షి అరుణగిరి నాథుడు, శేషాద్రిస్వామి వంటి మహాయోగులు ఈ పుణ్యక్షేత్రంలోనే సత్యాన్వేషణకై సాధన చేసి తరించారు. ఇంతటి పుణ్యక్షేత్రమైన ఈ క్షేత్రం పాద భాగం నుండి గంగ, ఆకాశం నుండి యమున, శిఖరస్నానం నుంచి నర్మదా నదులు, అరుణాచలేశ్వరుడుని అదృశ్యంగా సేవిస్తుంటాయి.

ప్రస్తుతం మనం చూస్తున్న ఆలయం 25 ఎకరాల స్థలంలో వ్యాపించి, ఏడు ప్రాకారాలు, తొమ్మిది గోపురాలతో విరాజిల్లుతున్నది. 1517 సంవత్సరంలో శ్రీకృష్ణదేవరాయులువారు తూర్పు వైపు ఉన్న 11 అంతస్తుల గోపురం, పుష్కరిణి, ఉత్సవ మూర్తుల మంటపం, వినాయకుని రథం అరుణాచలేశ్వరునికి అంకితం చేశారు. ప్రతి ఒక్క ప్రాకారం అనేక ఉపాలయాలతో, కోనేరులు, స్థల వృశ్యాలతో కనువిందు చేస్తుంది. ఆలయానికి నాలుగు వైపులా నాలుగు గోపురాలు నిర్మించబడ్డాయి. తూర్పువైపు ఉన్న గోపురాన్ని 'రాజగోపురం'అని, పడమర గోపురాన్ని 'వేయి గోపురం' అని ఉత్తరం వైపు నున్న గోపురాన్ని 'అమ్మణి అమ్మాళ్' అని దక్షిణం వైపు గోపురాన్ని 'తిరుమంజరు' గోపురం అని పిలుస్తుంటారు. రాజగోపురం నుంచి భక్తులు ఐదవ ప్రాకారం లోకి ప్రవేశిస్తారు. ఇచ్చట వేయిస్తంబాల మంటపం కనిపిస్తుంది. ఇచ్చట అభిషేక, తిరుమంజన సేవలు నిర్వహిస్తుంటారు. ఈ మండపానికి ఎదురుగా కంబత్తు అయ్యానార్ మండపం తిలకించవచ్చు. దీనికి దక్షిణంగా శివగంగ తటాకం చూడవచ్చు. ఈ తటాక జలమే పూజలకు వాడతారు. ఈ తటాకం ఉత్తర దిక్కున సర్వసిద్ధి వినాయక ఆలయాన్ని దర్శించుకోవచ్చు. ఈ గణేశ ఆలయం పక్కన ఒక పెద్ద నందిని తిలకించవచ్చును. ఈ నంది విగ్రహానికి ఎదురుగా దేవసేన, వల్లీ సమేత సుబ్రహ్మణ్యుడు భక్తులను అనుగ్రహిస్తుంటాడు.

నాల్గవ ప్రాకారంతో బ్రహ్మతీర్థం, దీని పక్కన కాలభైరవ మందిరాన్ని దర్శించవచ్చును. మూడవ ప్రాకారంలో 16 స్థంబాల మండపాన్ని చూడగలం. దీనినే 'దీపదర్శన మండపం' అని అంటారు. కార్తీక దీపోత్సవ సమయంలో ఇక్కడున్న విగ్రహాలను కొండకు అభిముఖంగా ఉంచి, కొండ శిఖరంపై వెలుగుతుండే జ్యోతికి చూపిస్తారు. ఈ మండపానికి ఎదురుగా ఉన్న ధ్వజస్థంబంపై ఎగురవేసే పతాకం ఉత్తరాయణ, దక్షిణాయన కార్తీక దీపోత్సవ ప్రారంభాలను తెలియజేస్తుంది. ధ్వజస్థంబానికి పక్కనే కనిపించే నందిని ప్రదోష నంది అని అంటారు. ఈ నందికి నెలలో రెండుసార్లు ప్రదోషకాలంలో అభిషేక అర్చనలు చేస్తారు. ఈ మండపానికి ఉత్తరదిక్కున గ్రామదేవత 'ఒడియారమ్మన్' సన్నిధి చూడగలము. ఆమె యావత్తు 'తిరువణ్ణాదులై' పట్టణాన్ని కాపాడుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. రెండవ ప్రాకారం ప్రవేశద్వారం ఇరువైపులా వినాయకుడు, పళని సుబ్రహ్మణ్యుడు కొలువైయున్నారు. ఈ ప్రాకారంలో 63 మంది నయనార్లును, సప్త మాతృకలు, 108 శివలింగాలు, రుక్మిణీ సమేత వేణుగోపాలురు మరియు ఇచ్చట పంచభూత లింగాలకు చెందిన ఐదు ఆలయాలున్నాయి. అందుకే తిరువణ్ణామలై క్షేత్రాన్ని దర్శించుకుంటే పంచభూత క్షేత్రాలన్నింటిని దర్శించుకున్నంత పుణ్యం లభిస్తుందని పెద్దలు అంటారు. ఇచ్చట పాతాళ లింగం ఆలయాన్ని తిలకించవచ్చును. ఈ లింగం చెంతనే రమణ మహర్షి తపస్సుతో నిమగ్నమై ఉండేవారని అంటారు. ఇక స్వామివారి మొదటి ప్రాకారంలో అనేక ఆలయాలను దర్శించవచ్చు. ముఖ్యమైన అరుణాచలేశ్వరుడు, బంగారు కవచంతో కానవస్తాడు. స్వామి చెంతన మేరుచక్రం, శయనప్రతిమ, యోగశక్తి అమ్మవారిని దర్శించుకోవచ్చు. అచ్చట వైకుంఠద్వారం నుంచి భక్తులు అరుణాచల పర్వతాన్ని భక్తితో దర్శించి నమస్కరిస్తారు. ముఖ్య ఆలయానికి సమీపంలోనే పార్వతీమాత, ఉన్నామలై అమ్మ పేరుతో తనను చూడవచ్చిన భక్తులందరికీ అభయమిస్తుంది. అమ్మవారి ఆలయంలో నున్న శిలలపై అష్టలక్ష్మీ విగ్రహాలు చెక్కబడి ఉండటం తిలకించవచ్చును. తిరువణ్ణామలైగిరి ఎలా ప్రసిద్ధమో, ఈ క్షేత్రంలో కార్తీక దీపోత్సవం కూడా అత్యంత ప్రసిద్ధం. కార్తీక మాసం ఉత్తరాషాడ నక్షత్రాన ప్రారంభమయ్యే ఈ వేడుక భరణీ నక్షత్రం రోజున ముగుస్తుంది. కార్తీక పౌర్ణమినాడు తెల్లవారురఝామున స్వామివారి గర్భాలయంలో భరణీదీపం వెలిగిస్తారు. ఆరోజు సాయంత్రం ఆరు గంటలకే తిరువణ్ణామలై మహాదీపం వెలిగించబడుతోంది. శాంతి ప్రదాయక జ్యోతిగా ప్రతి సంవత్సరం కార్తీక మాసంలో కృత్తికా నక్షత్రవేళ అరుణగిరిపై దర్శనమిస్తానని పరమేశ్వరుడు భక్తులకు వాగ్దానం చేశాడంటారు. అదే విధంగా ప్రతిఏడు ఇక్కడ లక్షలవేల భక్తుల సమక్షంలో కొండపైన అతిపెద్ద ప్రమిదలో దీపాన్ని వెలిగిస్తారు. దీని కోసం పది అడుగుల ఎత్తు, ఏడు అడుగుల చుట్టూ కొలతగల లోహపు పాత్రను కొండపై చేరుస్తారు. ఒక పెద్ద వస్త్రాన్ని దీపపు వత్తిగా వినియోగిస్తారు. అనంతరం ఈ లోహపు పాత్రలో వేయి కిలోల స్వచ్ఛమైన నేతిని పోసి మంత్రాచ్చారణతో వెలిగిస్తారు. బ్రహ్మాండమైన రీతిలో వెలుగులు చిమ్ముతుంటే ఆ జ్యోతి తిరువణ్ణామలైకు చుట్టూ సుమారు యాభై కిలోమీటర్ల దూరం వరకు కనిపిస్తూ ఆ జ్యోతి మూడు రోజుల పాటు నిరంతరాయంగా వెలుగుతూ కనిపిస్తుంది. రాత్రికి ఉత్సవమూర్తి అయిన నాయగర్ స్వర్ణమయ వృషభవాహనంపై అధిరోహించి ఊరేగుతాడు. ఆపీతకుచలాంబ, సుబ్రహ్మణ్యసమేతుడైన చంద్రశేఖరుడు తెప్పోత్సవంలో పాల్గొంటాడు. అక్కడ నుంచి అరుణాచలేశ్వరుడు ఊరేగింపుగా గిరి ప్రదక్షణ చేసి ఆలయానికి చేరుకుంటాడు. కార్తీక పౌర్ణమి సందర్భంగా జరిపే దీప దర్శనోత్సవం అత్యద్భుతం.



అరుణాచల శివస్మరణం ముక్తిదాయకం..

శ్రీ రమణుల తపోభూమి: తిరువణ్ణామలైలోని ప్రధాన దర్శనీయ స్థలాలలో శ్రీ రమణాశ్రమం ఒకటి తమ ప్రసన్న ప్రశాంతమైన చూపులతోనే, భక్తులలో వివేకపు వాకిళ్లు తెరిపించి వారి మనస్సులో జ్ఞానజ్యోతిని వెలిగించిన రమణ మహర్షుల వారి తపోభూమి. అరుణగిరి ముగింట ముత్యంలా ప్రకాశించే రమణాశ్రమం పరిసరాలు పరమ పశ్రాంతంగా అలరారు తున్నాయి. ఆశ్రమంలో మహర్షి సమాధి. శిలా విగ్రహాలు ఉన్న విశాలమైన హాలు, మహర్షి నిర్మాణం చెందిన గుడి, అందులో వారు వాడిన సామాగ్రి, ధ్యానమందిరం, వారి భక్తుల స్మారక మందిరాలు గోశాల, కార్యాలయం, పుస్తక విక్రయ కేంద్రం, భోజనశాల మొదలైనవి ఆశ్రమంలో చూడవచ్చును. ఉదయం 7 గంటల నుండి రాత్రి 7.30 వరకూ అభిషేకం. పూజలు, వేద పారాయణ, భజన, గ్రంథపఠనం వంటివి తిలకించవచ్చును. ఆశ్రమంలో వసతి కావలిసిన భక్తులకు వారం రోజులు ముందుగా రాస్తే ఆశ్రమం వారు ఉచిత వసతి భోజనాలు కల్పిస్తారు. భగవాన్ శ్రీరమణ మహర్షి.

అరుణాచల గమనం గురించి తెలుసుకుంటే అరుణాచల మహాత్యం ఎటువంటిదో మరింత స్పష్టంగా తెలుస్తుంది. తిరువణ్ణామలై క్షేత్రాన్ని దర్శించుటకు వచ్చిన భక్తులకు ఆలయ సమీపంలో సత్రములు, ప్రైవేటు లాడ్జీలు లభ్యమగుతాయి. తిరుపతినుంచి తిరువణ్ణామలైకు నేరుగా రైలు, బస్సు సౌకర్యములున్న వి.

`ఓం నమశ్శివాయ

# సాఫ్ట్ స్కిల్స్

ఎలెక్ట్రాన్



ఆ కుర్రవాడి నామకరణ మహోత్సవంనాడు కొంత రభస జరిగింది. ఇరువైపుల పితామహ, మాతామహుల పేర్లూ, నాయనమ్మా,అమ్మమ్మలు మొక్కుకున్నపేర్లూ, పేటలోని, ఊరిలోని. కొండలమీది దేవుళ్ల పేర్లూ, కన్నతల్లి చదువుతోన్న, చూస్తోన్న ధారావాహికల్లోని నాయకుల అత్యాధునికమైన నామధేయాలూ-అన్నీ గజిబిజిగా కలిపేసి చాంతాడంత పొడుగు పేర్లు కాస్త ఎగతాళిగా సూచిస్తూ ఆహ్వానితులు ఆనందించారు. కుర్రాడి తండ్రి పవన్ కుమార్,

"నాకొడుకు దక్షుడౌతాడు, వర్ధమానుడౌతాడు, నందనుడౌతాడు. అందుచేత వీడిపేరు దక్షవర్ధనందన్. ఇక మీరెవరూఅనవసర రాద్ధాంతం చేయకండి. తండ్రిగా ఇది నా అంతిమ నిర్ణయం," అంటూ, పురోహితుడు 'జన్మనక్షత్రం,

నామనక్షత్రం సరిపోవు!' అని లోలోపల గొణుక్కుంటూ ఉండగా బియ్యంలో పేరు రాసేశాడు. పురోహితుడు తన సణుగుడిని ఏవో లెక్కలు కడ్తున్నట్టుగా మార్చి, " అద్భుతం! జాతకానికి తగ్గపేరు. దేవతలే ఈ పేరు మీ నోటమ్మట పలికించేశారు!" అన్నాడు గట్టిగా. ఆయనగారికి పిల్లవాడి భవిష్యత్ కన్నా, అప్పటికప్పుడు తనకి ముట్టే సంభావన ముఖ్యం.

"మరీ అంతా కష్టమైన పేరు నోరు తిరగొద్దురా !?" అంది కుర్రవాడి నాయనమ్మ."పర్వాలేదమ్మా! దక్షా, వర్ధా,నందా అనో, లేదా దక్షూ, వర్ధూ, నందూ అనో ఎవరిష్టమొచ్చిన పేర్లతో వారు పిలుచుకోవచ్చు.కాదంటారూ, అన్ని ముందక్షరాలూ కలిపి దవనం అని పిలవండి. నాలికా సులువుగా తిరుగుతుంది, వినడానికీ వింతగా ఉంటుంది!"

అన్నాడు. ఏది ఏమైనా తండ్రి పవన్ కుమార్ చెప్పినట్టుగా కుర్రవాడి పేరు దవనంగా స్థిరపడిపోయింది. అంతేకాదు, అంతవరకూ పవన్ గా చెలామణీ అయిన అతని పేరు పవనంగా మారి, పవనంగారబ్బాయి దవనం అని వెనుకబాటు మాటలు కూడా ప్రచారంలోకి వచ్చేసాయి.

అన్నప్రాశన జరిగిన రోజు నుంచీ, తల్లి అనురాగవల్లి దవనాన్ని టీవీ ముందు ఒళ్ళో కూర్చొబెట్టుకొని, గోరుముద్దలు తినిపించడం మొదలు పెట్టింది. దవనంగాడి బుద్ధివికాసాలు టీవీ వీక్షణంతోనే పెరగసాగాయి. వాడికి టీవీ ముందు లేందే ముద్ద దిగేది కాదు. స్కూలునుంచి తిరిగి రాగానే పుస్తకాల సంచీనీ ఒ మూల గిరవాటేసి, టీవీ ముందు కూలబడేవాడు. సాయంత్రం ఆఫీసునుంచి తిరిగివచ్చే తండ్రి స్కూటర్ చప్పుడు వినగానే దవనం ఠక్కున టీవీ ఆపేసి, చదువులగదిలోకి పోయేవాడు. ఏమాటకామాటే చెప్పుకోవాలి, ఈ భయమే దవనాన్ని చదువుమీదకూడా దృష్టిసారించేటట్టు చేసింది. కానీ, టిఫిన్, భోజనాలేవైనా సరే టీవీ ముందరే. పవనం కూడా ఈ విషయంలో దవనానికి స్వేచ్ఛనిచ్చేశాడు.

దవనానికి అయిదో సంవత్సరంనుంచే లోకజ్ఞానం విపరీతంగా పెరిగిపోయింది. వంటల కార్యక్రమం చూస్తే అలాంటివి వండమని పేచీ పెట్టేవాడు. ఆ వంటల్లో వాడే కొన్ని ఆ ఊరి దుకాణాల్లో దొరికేవి కావు. వాడి సణుగుడు భరించ లేక తండ్రి ఎప్పుడైనా పెద్ద ఊర్లు పోయినప్పుడు సూపర్ మార్కెట్లలో కొని తీసుకొని వచ్చేవాడు. మనవడి తలతిక్క వ్యవహారం చూసి నాయనమ్మ వాడికి గోంగూరపచ్చడి, నువ్వులనూనే, పచ్చిఉల్లిపాయ ముక్క మప్పేసింది.

దాంతో దవనం రెండు పూటలా దానికి అలవాటు పడిపోయాడు. ఓ రోజు ఉన్నట్టుండి 'నాకు ఉల్లిపాయ ముక్కలొద్దు, చక్రాలు కావాలి !' అని పేచీ పెట్టాడు. క్యారట్, కీరా, టమేటా సలాడ్ సమతుల్యాహారం అని టీవీ లోని ఓ అమ్మలక్క చెప్పిన మాటలు విని, పగలూ రాత్రీ సలాడ్ లేనిదే ఆహారం ముట్టేవాడు కాదు. అవైనా ముక్కలు ముక్కలుగా ఉండకూడదు. అన్నీ చక్రాలరూపంలోనూ, వీలైతే విష్ణు చక్రాల రూపంలోనూ ఉండాలి. తండ్రి నెట్ లో చూసి కూర గాయాల్ని వివిధ ఆకృతుల్లో తరిగే రెండు సాధనాల్ని తెప్పించాడు. దవనం తిండిపోతు కాదనీ, కానైతే తిండి రుచికరంగా ఉండాలనీ, దర్జాగా తినాలనే తాపత్రయంగలవాడని గుర్తించాడు. అందుకోసమని మంచి చైనా బోన్ వేర్, డిన్నర్ సెట్లూ, కప్పులూ, మేలురకం క్లబ్ హౌస్ గాజు గ్లాసులూ కొని, టీవీ ముందు భోజనం చేసే దవనం అలవాటుని నెమ్మది నెమ్మదిగా డైనింగ్ టేబుల్ మీదకు మళ్లించాడు పవనం. అయిదో తరగతిలోకీ, పదో ఏడులోనూ ప్రవేశించిన దవనం డైనింగ్ టేబుల్ మీద నాయనమ్మా, లేదా అమ్మ వండిన పదార్థాలతో రకరకాల ప్రయోగాలు చేసేవాడు. ఘాటుగా చేసిన ఇంగువ చారులో గోంగూర పచ్చడి కలిపి చారుకావాలంటే చారు, పులుసుకావాలంటే పులుసు అనేవాడు. తిని రుచి చూసి ఉపాయం బాగానే ఉందనుకొన్నారు.

వీడి వాలకం చూస్తే ఏ క్యాటరింగ్ బిజినెస్సో నుదుటిమీది గీతగా రాసుందేమోనని అనురాగవల్లి ఆందోళన వ్యక్తం చేస్తే,"వాళ్ళూ లక్షలు గడిస్తున్నారు, పర్వాలేదు!" అని సముదాయించాడు పవనం.

"నా బెంగ అది కాదండీ! రేపు వీడు పెరిగి పెద్దయిన తర్వాత పిల్లనెవరిస్తారు? సంపాదించేదెంతైనా వంటవాడు వంట వాడే, సాఫ్ట్ వేర్ ఇంజనీర్ కాలేడు కదా?"

"వీడికిప్పుడు పదేళ్ళు. పదహారుకి పది పాసవుతాడు. పద్దెనిమిదికి ఇంటర్, ఇరవై రెండుకి ఇంజనీరింగ్ అయిపోతుంది. ఢోకాలేదు. కానైతే పన్నెండేళ్ళ తర్వాత అప్పటి ఇంజనీరింగ్ విద్యార్థులు దేశమంతటా కనీ, వినీ ఎరుగని ఉద్యోగాలు చేస్తుంటారు. వంటలో వీడి నేర్పుచూసి, చిన్నతనంనుంచి వంటగది మొహం చూడక, ఉద్యోగాలు చేసే అమ్మాయిలు వరస కడ్తారు. బెంగ పడకు. పర్వాలేదు, ప్రయోగాల్ని చెయ్య నివ్వు!" అని భార్యకి నచ్చ చెప్పాడు.

ఓ రోజు పవనం చిన్ననాటి స్నేహితుడు అనుకోకుండా కలిస్తే, చెప్పాపెట్టాకుండా, ఇంటికి భోజనానికితీసుకొచ్చేశాడు. ఆ రోజు ఆదివారం కాబట్టి దవనం ఇంట్లోనే ఉండిపోయాడు. దవనం, పవనం, దవనం తాతా, పవనం స్నేహితుడూ- నలుగురూ భోజనానికి కూర్చున్నారు. మామిడికాయ పప్పూ, బెండకాయ వేపుడూ, గోంగూర పచ్చడి అతిథిగారికి అతిగా నచ్చేసాయి. ఆయన చారు గిన్నెమీది మూత తీసి రెండు గరిట్లు అన్నలో పోసుకొని కలుపుకున్నాడు. రెండుముద్దలు తినేసరికి వికారంగా మొహం పెట్టాడు. దవనం విషయం గ్రహించాడు. ఏదో విధంగా నాయనమ్మ పేరు పోకుండా కాపాడాలనుకొన్నాడు.

" అంకుల్! చారెలా ఉంది? దాని పేరు బనానా రసం. మొన్న సాయంత్రం మహారుచీ టీవీ చానెల్ లో ఈ చారెలా చెయ్యాలో సురుచి అనే ఆవిడ చూపించింది. చారుకాచి అందులో ఒక చక్రకేళి, ఒక అమృతపాణి, ఒక చిరుతచుక్కల అరటిపండూ వేసి మిక్సీలో గిలక్కొట్టమని చెప్తూ, చేసి చూపించింది. మా నాయనమ్మ చారు కాస్తే నేను దాన్ని బనానా రసంగా మార్చేశాను. బాగాలేకపోతే వదిలేయండి. నన్ను క్షమించండి!" అన్నాడు.

ఆయన నవ్వుతూ, "పర్వాలేదు! ఉగాది పచ్చడిలో అరటిపళ్ల ముక్కలు వెయ్యడం ఆనవాయితే! మామిడి పులుపు కన్నా, వేప చేదుకన్నా, నమిలితేకాని రుచి తెలియని చెరకు కన్నా, మెత్తగా తియ్యదనాన్ని అందించే అర-

టిపండు చాలా మంచి రుచిని ఉగాది పచ్చడికి కల్పిస్తుంది. కానైతే సురుచి చెప్పడమే మరిచిందో, లేదా నువ్వే కంగారులో మరిచావొ కానీ అరటి పళ్ళని తొక్కతీయకుండా మిక్సీలో పడేసుంటావు!" అన్నాడు.

"లేదంకుల్! అరటిపండు తొక్కలోకూడా చాలా పోషక పదార్థాలుంటాయని మొన్న నెట్ లో చూశాను. అందుకని నేనే తొక్క వలచకుండా మిక్సీ పట్టేశాను. తప్పు నాదే, సురుచిది కాదు!" అన్నాడు దవనం. పవనానికి కూడా కొడుకుని మందలించే అవకాశం దొరకలేదు. అయితే ఆ రాత్రి దవనం వదలకుండా మామ్మ చేసిన చారులో తొక్కవలిచిన అరటిపళ్ళు వేసి బనానా రసం చేశాడు. ముందస్తుగా అందరికీ అదోలా అనిపించినా, అన్నంలో కలుపుకోకుండా ఉత్తినే తాగితే బావుందనే అనిపించింది. తర్వాత మామిడిపండు చారు, అనాస చారు, పనస తొనలచారులాంటి ప్రయోగాలెన్నో చేశాడు. అందరూ కాస్త భరించి తాగేవారు. " పచ్చి ఆకుకూరల రసాలు మార్నింగ్ వాక్ చేసేవారు జాగింగ్ ట్రాక్ ల వద్ద విరగబడి తాగుతున్నారు. ఇంట్లో చేసిన బలవర్థకమైన రసానికేం తక్కువ నాన్నగారూ?" అని దవనం వాదన చేసేవాడు.

మరోసారి దవనం తల్లి అనురాగవల్లి స్నేహితురాలు మకరంద తన ఆరేళ్ళ కూతురితో ఓ సాయంత్రం కలవడానికి వచ్చింది. ఆ అమ్మాయి పేరు క్షుదిత. దానికెప్పుడూ ఏదో తినాలని యావ. అడిగిన వెంటనే ఏదైనా తినడానికి యివ్వకపోతే పైకప్పు బీటలు వారేటట్లు ఏడుస్తుంది. దవనం అప్పుడే తన పదోతరగతి క్లాసునుంచి ఇంటికి వచ్చాడు.

క్షుదిత ఏడుపు అప్పటికి మొదటి శ్రుతిలో ఉంది. అనురాగవల్లి కొడుకుని చూస్తోనే, " స్కూలు నుంచి ఎప్పుడొస్తావా అని నీ కోసమే చూస్తున్నాను. పాప ఏడుస్తోంది. పోయి దుకాణంలో ఓ క్యాడ్ బరీస్ చాక్లెట్ కొని పట్టుకురా. ఓ అరకిలో శెనగపిండి కూడా పట్టుకు రా. మనందరికీ పకోడీలు చేస్తాను," అంది.

"మన వీధి షావుకారు ఇవ్వాళ దుకాణం తెరవలేదు. వాళ్ళమ్మని ఆస్పత్రిలో చేర్చారట. పెద్ద బజారుకి పోయిరావాలి. అలస్యమౌతుంది. క్షుదీ! నాతో లోపలికి రా, నీకో మంచి స్వీటు చేసి పెడ్తాను," అన్నాడు.

క్షుదిత ఏడుపునాపి దవనం వెనకాల నడిచింది. దవనం ఫ్రిజ్ తలుపుతీసి రూ అఫ్జా షర్బత్ సీసా పైకి తీశాడు. ఓ చిన్న బౌల్ తీసుకొని అందులో అరకప్పు షర్బత్ పోశాడు. షెల్ఫ్ లోంచి బౌర్నవిటా డబ్బా తీసి నాలుగు చెంచాలు బౌల్లో వేశాడు. అలాగే అరడజను చెంచాల హార్లిక్స్ పౌడర్ని వేసి, బౌల్ లో మిశ్రమాన్ని కలిపాడు. అది చిక్కగా క్యారట్ హల్వా రూపు సంతరించుకొంది. తల్లి ఫ్రిజ్ లోపలికంటా ఉంచిన రెండు ప్యాకెట్లను బయటకి తీసి ఓ అరడజను జీడిపప్పు పలుకుల్నీ, ఓ పది కిస్మిస్ పళ్లనీ వేసి కలిపాడు. పెరట్లో ఉన్న తులసి మొక్కనుంచి మూడు ఆకులుతుంచి, నీళ్ళతో కడిగి పైన అద్దాడు. ఓ చిన్న స్టీల్ చెంచాతోసహా దాన్ని క్షుదితకందించి, ముందు హాల్లోకి తీసుకుపోయి, కూర్చోబెట్టి, "వంటిమీద పడకుండా జాగ్రత్తగా తిను. లేకపోతే నీ డిజైనర్ గౌను పాడైపోతుంది !" అని తన గదిలోకి పోయాడు.

మకరంద కూతురి చేతిలో ఉన్న స్వీట్ బౌల్ని చూసింది. ఆమెకు రంగు చూసి నోరూరింది. అయినా సభ్యత అడ్డు రావడంతో, "అన్న చెప్పినట్టు జాగ్రత్తగా తిను. లేకపోతే అయిదొందదల రూపాయల డిజైనర్ గౌను మరకలు పడిపోతుంది!" అంది. ధర సంగతి స్నేహితురాలికి తెలియాలిగదా? క్షుదిత మూడు చెంచాలు ఆబగా నోట్లో వేసుకొని నాలుగో చెంచా తీసుకొని తిందామని నోరు తెరావడానికి ప్రయత్నిస్తే పెదాలు విడక గింజుకో సాగింది. ఆ వంకన మకరంద, "అయ్యో ఏం జరిగింది?" అంటూ ఆ చెంచా లాక్కుని నోట్లో వేసుకొంది. రూ అఫ్జా తియ్యదనం, జీడిపప్పు కమ్మదనం,

బోర్నవిటా చిరుచేదుతో హల్వా నోటికి రుచిగానే ఉంది. కానీ ఎక్కువైపోయిన హార్లిక్స్ పొడి బంకలా నోటిని ట్టేసింది. ప్రయత్నం మీద నోరు తెరిచి," మీ దవనం అసాధ్యుడే! రూ అఫ్జాతో ఇన్ స్టెంట్ హల్వా చేశాడు. చాలా బాగుంది, కానైతే పాళ్ళు ఇంకా సరిగా పడాలి !" అంది లేని నవ్వు తెచ్చుకొంటూ. క్షుదిత నెమ్మదినెమ్మదిగా నోట్లోకి వెళ్లినదాన్ని కరిగించుకుంటూ మొత్తానికి బౌల్ ఖాళీ చేసింది.

నాలుగోరోజు సాయంత్రం మకరంద అనురాగవల్లి ఇంటికి దవనం స్కూలు నుంచి వచ్చే వేళకు చేరుకొని, దవనాన్ని ఓ పక్కగా తీసుకుపోయి, "ఈ నాలుగు రోజుల్లోనూ ఒక సీసా హార్లిక్స్, ఒక డబ్బా బోర్నవిటా, ఒక సీసా రూ అఫ్జా, వందగ్రాముల జీడిపప్పు, వందగ్రాముల కిస్మిస్ పళ్ళు అవగొట్టేసింది. దాని ఈ అలవాటు మాన్పించే బాధ్యత నీదే! లేకపోతే అంకుల్ కి వచ్చే జీతం చాలదు!" అంటూ రుద్ధకంఠంతో కళ్ళు తుడుచుకుంది.

"కంగారుపడకు ఆంటీ! దాని రోగం నేను కుదురుస్తాను. మీరు వెళ్ళి అమ్మతో మాట్లాడుతూ కూర్చోండి. నేనిప్పుడే వస్తాను," అని ఆవిణ్ణి ముందుహాల్లోకి పంపించి రూ అఫ్జా హల్వా చేశాడు. దవనం నాయనమ్మ దగ్గు నివారణ కోసం కరక్కాయ పొడి వాడుతుంది. దాన్ని ఓ చెంచాన్నర అందులో కలిపి క్షుదితకిచ్చాడు. అది రెండు చెంచాలు ఆబగా నోట్లో వేసుకొని, వెంటనే ఉమ్మేసి ఏడుపు లంకించుకొంది. తొడుక్కున్న గౌను ముందుభాగం ఖరాబైంది. మకరంద ఏమైందేమైంది అని తను ఓ చెంచాడు నోట్లో వేసుకొని, దవనం కనుసన్నలందుకొని, తమాయించుకొని," ఇంత బావుంటే అలా ఉమ్మేయడమేమిటే, ఆరొందల డిజైనర్ గౌను మరకలైపోయింది!" అంది. వాస్తవానికది క్రితం సారి తొడిగిన అయిదొందల డిజైనర్ గౌనే!

" నేను చెప్పడం మరిచాను ఆంటీ! దీన్ని మితిమీరి తింటే నాలికలోని రుచికణాలు దెబ్బ తిని తర్వాత చేదు అనిపిస్తుంది. క్షుదితా! బయటకిపోయి నీళ్ళతో నోరు పుక్కిలించి రా!" అన్నాడు.

మకరంద కూతురితో ఆ పని చేయించి లోనికి తీసుకు వచ్చింది. దవనం జేబులోంచి రెండు చిన్న టాఫీల్లాంటివి ఇచ్చాడు. అవి అతిపల్చటి సెలోఫిన్ కాయితాల్లో చుట్టబడి ఉన్నాయి. క్షుదిత రేపర్ తీస్తే నల్లగా నిగనిగ లాడుతూ కుంకుడు గింజంత టాఫీ కనబడింది. క్షుదిత దాన్ని నోట్లోవేసుకొని చప్పరించి, "భలేబావుంది!" అంటూ రెండో దాని రేపర్ తియ్యసాగింది. " ఏయ్, క్షుదీ! ఇవి అన్నం తిన్న తర్వాత ఒకటంటే ఒకటే తినాలి. తిన్నది బాగా అరుగుతుంది. అలాగని ఎప్పుడుపడితే అప్పుడు తింటే పళ్లు పాడైపోతాయి, జాగ్రత్త!" అని హెచ్చరించాడు. దవనం లాగు జేబులోంచి మరో రెండు తీసి ఒకటి మకరందకీ, మరొకటి తల్లికీ ఇచ్చాడు. వాళ్ళు వాటిని నోట్లో వేసుకొని, ''నిజంగానే బావున్నాయి!" అంటూ చప్పరించారు.

"ఆంటీ వీటి తయారీలో చింతపండూ, పంచదారా తప్ప మరేమీ లేవు. సూపర్ మార్కెట్లో వందగ్రాములకీ నలభై తీసుకొంటున్నారు. ఎలా ఉంటాయో చూద్దామని పది రూపాయలకి పాతిక గ్రాములు తీసుకొన్నాను." అన్నాడు దవనం.

" దవనం! వచ్చే ఆదివారం ఓ పావుకిలో చింతపండుతో టాఫీలు చేసి చూడు. తాతగారూ, నయనమ్మా అన్నం తిన్న తర్వాత రుచిగా చప్పరిస్తారు!" అంది అనురాగ వల్లి. అప్పటికి గండం గడిచినా, ముందుముందు ఏమౌతుందేమోనని మకరంద కూతురు జబ్బ పట్టుకొని కదిలింది. ఇంటికి వెళ్ళగానే గౌను పాడు చేసుకొన్నందుకు నాలుగు ఉతికింది. క్షుదితకు దాంతో తల్లి అంటే భయం పట్టుకొని కాస్త మాట వినసాగింది.

దవనం ఆ వచ్చే ఆదివారం కాస్త వాము పొడికూడా కలిపి ప్రయోగం చేసి అందరి మెప్పూ పొందాడు. నెలవారి సర్కుల లిస్ట్ లో ఓ పావు

కిలో చింతపండు అదనంగా చేర్పింది అనురాగవల్లి.

చూస్తూండగానే దవనం మరో రెండేళ్లలో ఇంజనీరింగ్ లో అడుగు పెట్టేశాడు. ఆ కాలేజీ ప్రిన్సిపాల్ పేరు

మిసెస్ సమహక్. "రోజులు మిసెస్

మిసెస్ సమహక్. "రోజులు మారాయ్! ఆలుమగలు ఉద్యోగాలు చేసే రోజులు పోనుపోనూ ఇంకా పెరిగిపోతాయి. మగవారు కూడా వంటలు చెయ్యడం నేర్చుకోవాలి. తల్లులు చేస్తున్న గారాబం వల్ల వంటింటి ముఖమే చూడని ఆడపిల్లల సంఖ్య కూడా పెరిగిపోతోంది. అందుకని ప్రతి ఆదివారం మీరు వంతులవారీగా పదేసి మంది హాస్టల్ కుక్స్ ఆధ్వర్యంలో వంటపనుల్లో పాల్గొంటూ, వంటలు నేర్చుకోవాలి. క్యాంపస్ ఇంటర్వ్యూలు చేయడానికి పంచనక్షత్రాల హోటలు యాజమాన్యాలు ఆసక్తిని చూపిస్తున్నాయి. ఈ సాఫ్ట్ స్కిల్ మీ భవితకి ఇంటాబయటా కూడా మంచిది.!" అంటూ ప్రోత్సాహం ముసుగులో మానసికంగా బెదిరించింది.

దవనం కుక్స్ అందరికీ అభిమానపాత్రుడైపోయాడు. వారిచేత పలు ప్రయోగాలు చేయించి, మెస్ బిల్ పెరగకుండా కొత్తకొత్త వంటకాలు చేయించేవాడు. వంతులవారినే కాకుండా వీలున్న ప్రతీ ఆదివారం తన మెస్ వంటశాలకి చేరుకొనేవాడి వీపువెనక బిరుదు ఇతర విద్యార్థులు ఆపాదించేశారు.

ఆర్నెల్ల తర్వాత సమహక్ వంటల పోటీ పెట్టింది. కుక్స్ ఓ పదిమంది విద్యార్థుల పేర్లు సూచించారు. వారిలో అయిదుగురు విద్యార్థులు, అయిదుగురు విద్యార్థినులు. న్యాయనిర్ణేతలుగా ముగ్గురు జిల్లా అధికారుల భార్యలు నియమితులైయ్యారు. జిల్లా కలెక్టర్, జిల్లా జడ్జి, జిల్లా డి.ఎస్. పి ల భార్యలు. ఇంట్లోకూడా నిత్యమూ వంటవాళ్ల భోజనాలే అలవాటుపడ్డ గృహిణులే కానీ చెయ్యి కాల్చుకొనేవారు కాదు.

అవ్వాల్టి పోటీ వంటకం చారు. పది టేబుల్లమీద పది గాస్ స్టవ్ లు. ఒక్కొక్కరికీ ఒక్కొక్క సహాయకుడు లేక సహాయకురాలు. ఎవరి టేబుల్ మీద వారికి కావల్సిన సంభారాలన్నీ సమకూర్చుకొన్నారు. వెనక రెండు టేబుల్లమీద అయిదేసి మిక్సీలు. వాటిముందు నెంబర్లు వేసిన అట్టముక్కలు.

ఛీఫ్ కుక్ విజిల్ ఊదగానే అందరూ తమతమ ప్రయత్నాలు మొదలు పెట్టారు. కొందరు ఎమ్.జి. రసం మసాలా, కొందరు మైసూరు రసం మసాలా, కొందరు మలబారు రసం మసాలా –ఇలా సినీతారాల ప్రకటనల ద్వారా ప్రాచుర్యం పొందిన మసాలా పొడులను వాడారు. దవనం మట్టుకు మార్కెట్ తయారీ పొడులేమీ వాడకుండా అప్పటికప్పుడు కొద్దిగా వేయించిన ధనియాలు,జీలకర్ర, మిరియాలు, కంది పప్పులను కేవలం పది సెకన్లు గరుకుగా మిక్సీ పట్టించి వాడాడు. దండిగా కొత్తిమీర తీసుకొని సహాయకుడుకిచ్చి మిక్సీలో ముద్దచేసి తీసుకు రమ్మన్నాడు. ఇరవై నిముషాల వ్యవధిలో అందరి చారూ తయారైపోయింది. న్యాయ నిర్ణేతలు ముగ్గురూ తమ భారీ కాయాలతో సుతారంగా నడుచుకొంటూ, ఆడపిల్లలవైపు నుంచి ఒకటీ రెండు చెంచాలు రుచి చూస్తూ, మార్కులు వేసుకొంటూ ముందుకు కదిలారు. చివరికి దవనం వద్దకు వచ్చి అలా రుచి చూస్తూనే ఇలా 'యాక్' మంటూ ఉమ్మేశారు. మిసెస్ సమహక్ కూడా రుచి చూసి 'యాక్' అంది.

వరసలో రెండవదైన అనూహ్యకి మొదటి బహుమతి, నాల్గవదైన కుసుమకుమారికి రెండవ బహుమతి,

అరవవాడైన అరవముత్తుకి మూడోబహుమతి ప్రదానం చేశారు. దవనానికి పదో స్థానంకూడా ఇవ్వకుండా విఫలుణ్ణి చేశారు. దవనం తను కాచిన చారు రుచి చూసి, దీనంగా చీఫ్ కుక్ వైపు చూశాడు. ఛీఫ్ కుక్ కూడా రుచి చూసి, ''నాయనా, దవనం!. నీకు ప్రథమ బహుమతి ఖాయమనుకొన్నాం. ఏదో మోసం జరిగింది. ఉద్రేకపడకు. ఇది సరదా పోటీయేకాని

యూనివర్సిటీ పరీక్షేమీ కాదు," అని ఊరడించాడు.

కార్యక్రమం ముగిసిన తర్వాత మిసెస్ సమహక్ దవనాన్ని పిలిచి కాలేజీకి అవమానం జరిగిపోయిందని గద్దించింది. ఇటువంటివాణ్ణి ఎందుకు పోటీకి రికమెండ్ చేశావని ఛీఫ్ కుక్ మీద ఆగ్రహం ప్రకటించింది.

ఛీఫ్ కుక్ చేతులు ముడుచుకొని వినయంగా అన్నాడు. "మేడమ్! దవనం కొత్తిమీరని మిక్సీలో ముద్దచేసి తీసుకురమ్మని సహాయకుడు దిగ్విజయ్ కి చెప్పాడు. అతగాడు రహస్యంగా దవనాన్ని, మరువాన్నీ కొత్తిమీరతో కలిపి మిక్సీ పట్టేశాడు. ఇది దవనం తప్పు కాదు.!" అన్నాడు.

సమహక్ దిగ్విజయ్ ని పిలిచి నిలదీసింది. అనూహ్య అంటే తనకి అభిమానమనీ, దవనాన్ని ఓడించడానికీ, ఆమెకు గెలిచే అవకాశం కల్పించడానికీ తప్పు చేశానని ఒప్పుకొన్నాడు.

" దవనాన్ని తప్పిస్తే ఆమే గెలుస్తుందని ఎలా అనుకొన్నావ్?" మిసెస్ సమహక్ ప్రశ్నించింది.

"అనూహ్యకి రోయ్యలపొట్టుకల చారుపొడిని అందించింది నేనే! దాని రుచి అమోఘం!" అని చెంపలు వేసుకొన్నాడు.

" మేడమ్! దిగ్విజయ్ ని దండించకండి. అతను అనూహ్యను గాఢంగా ప్రేమిస్తున్నాడు. ఎవరు చేసిన వంటను వారు తయారుచేస్తున్నప్పుడు రుచి చూడకూడదన్న మీ నిబంధన సరైనది కాదు. వంటచేసే వాడికి ముందుగా రుచి చూసే అవకాశముండాలి. ఆ అవకాశమే ఉంటే నా అంతట నేనే పోటీనుంచి నిష్క్రమించే వాణ్ణి," అన్నాడు దవనం.

" వృద్ధిలోకి వస్తావయ్యా దవనం. నిన్ను చూసి నేను గర్విస్తున్నాను. అయితే మీరు ముగ్గురూ ఈ విషయమై ఎవరితోనూ చెప్పకండి. పత్రికలు చెడుగుడు ఆడేస్తాయి!" అంది సమహక్ వేడుకోలుగా.

ఇంజనీరింగ్ డిగ్రీ చేబట్టిన తర్వాత దవనం మెన్యూ కన్సల్టెంట్ సంస్థను స్థాపించి చాలా పెద్దపెద్ద హోటళ్ళకు సలహాదారుడిగా ఉన్నాడు.

***

---

# కారణ జన్ములు .... సరస్వతీ అవతారం ... శ్రీ మంగళంపల్లి బాలమురళీ కృష్ణ

(30 వ పేజీ తరువాయి)

అంతా ఆయన చెప్పినట్లే జరిగాయి . ఇప్పటికీ జరుగుతున్నాయి. అలాగే ఎంతో మందికి ఎన్నో చెప్పి, ప్రజా సేవే ఆయన జీవితం అనుకునేవారు.

బాల మురళీ కృష్ణకి ఏదైనా కావలిస్తే నాన్నగారిని అడిగే వారుట జ్యోతిష్యం గురించి. అలాగే నాన్న గారు కవి. ఎన్నో మంచి మంచి పుస్తకాలు వ్రాసారు.

అంతేకాదు బాల మురళీ కృష్ణ చివరి కచేరీ వరకు ఆయన గొంతులో ఎటువంటి జీర ఉండదు. అది కూడా ఆయన కుటుంబంలోనే ఉంది అనుకుంటాను. ఎందుకంటే బాలమురళీ కృష్ణ మేనమామ కూతుళ్లు పాడతారు ఇప్పటికీ. వారి వయస్సు 85 సంవత్సరాలు అయినా కూడా ఇప్పటికీ అలాగే పాడతారు. ఆయన ఏకాదశి నాడు పుట్టారు. మరి డేట్స్ లో ఎందుకు చేసుకుంటావు? అని అడిగితే, తద్దినం తిథులలో పెడతారు కదా! అందుకని నాకు తిథి రోజున పుట్టిన రోజు చేసుకోవడం ఇష్టం ఉండదు అన్నారు.

"మంగళంపల్లి" ఇంటి పేరుకే అంత గుర్తింపు తెచ్చిన బాల మురళీ బాబాయ్ మంగళంపల్లి ఇంటి పేరు కలిగిన మేమంతా నీకు ఋణపడి ఉన్నాము. ఎంతో అదృష్టవంతులం ... ఎన్ని జన్మలెత్తినా నీ కుటుంబ సభ్యులుగానే పుట్టాలని కోరుకుంటూ... పాదాభివందనములు


# బతుకుపోరు నుండి తెలంగాణ బి.సి.ఛైర్మన్ దాకాఎదిగిన సామాజిక తత్త్వశాస్త్రవేత్త బి.ఎస్. రాములు



తుమ్మూరి రాంమోహనరావు




"సామాజిక వాస్తవికతకు భిన్నంగా రాయడం,పాఠకులను భ్రమల్లో ముంచడంనాకిష్టముండదు. సామాజిక వాస్తవికత చిత్రించినప్పుడే సమకాలీనసాహిత్యం,సాహిత్యంలో సామాజిక చరిత్రగా రికార్డు చేయడం వల్ల అదివర్తమానానికి,- భవిష్యత్తు తరాల వాళ్లకు ఎంతగానో ఉపయోగపడుతుంది అంటారు ఒక ఇంటర్వ్యూలో, ప్రసిద్ధ సామాజిక తత్త్వవేత్త,రచ-



యిత తెలంగాణ బి.సికమిషన్ తొలి చైర్మన్ అయిన బి.ఎస్.రాములు ఉరఫ్ బేతి శ్రీరాములు.

కొందరి జీవితాలను పరిశీలిస్తే పరిస్థితులు వారిని,వారి గమ్యాలపైపు తీసుకుని వెడతాయనిపిస్తుంది. కాలానుగుణంగా తానెదురుకున్న సంఘటనలనుండిఎప్పటికప్పుడు తనను తాను తీర్చి దిద్దుకుంటూ,తనను తాను మలచుకుంటూ నిత్యచైతన్య శీలిగా తాను గ్రహించిన జ్ఞానాన్ని పది మందితో పంచుకోవాలని కలం చేతబూనిబహుగ్రంథ కర్తగా సామాజిక తత్త్వవేత్తగా రూపొందిన బి.ఎస్.రాములు గారిది నిజంగా-బతుకుపోరే.'బతుకుపోరు' అని ఎందుకు అంటున్నానంటే నలభై- ఏళ్ల క్రితం ఆయనవెలువరించిన ఆయన తొలినవల పేరు.విద్యార్థి దశనుండే సాహిత్యం పట్ల ఆసక్తితో రచనలు చేయడం,చిన్నచిన్న రచనలు చేయడం

అలవాటు గనుక తాను ఏ ఉద్యమంలో ఉన్నా తన రచనా వ్యాసంగాన్ని మాత్రం వదలుకోలేదు.

విచిత్రమైన విషయం ఏమిటంటే ఐదు దశాబ్దాల క్రింది బి.ఎస్.రాములు గారినిచూచిన వారెవ్వరూ ఆయన ఈ స్థాయికి ఎదుగుతారని కలలో కూడా ఊహించేఅవకాశం లేదు.నేను అప్పటి నుండి ఇప్పటి దాకా చూస్తూ వస్తున్న వాళ్లలో ఒకణ్ని కనుకఈ విషయం గట్టిగా చెప్పగలను.


ఎక్కడి హాస్టల్ వార్డెన్-ఎక్కడి సామాజిక తత్త్వవేత్త? ఎక్కడి రహస్యోద్యమ కార్యకర్త-ఎక్కడి బి.సి. కమిషన్ ఛైర్మన్?

పుట్టిన ఊరు జగిత్యాలలోచిన్నప్పుడు సాతాని అయ్యోరు పంతులు దగ్గర బాలశిక్షతోమొదలయ్యింది విద్యాభ్యాసం. మర్కజి ప్రైమరీ

తరువాత మల్టీ పర్పస్ పాఠశాల మేగజైన్కోసం కందపద్యాలు రాసిన బాలుడు తెలుగు పండితుడు కావాలనుకున్నాడో ఏమో,
ధర్మపురి శ్రీలక్ష్మీనరసింహ సంస్కృతాంధ్ర కళాశాలలో డిప్లమా ఇన్ ఓరియంటల్లాంగ్వేజెస్,బ్యాచిలర్ ఆఫ్ ఓరియంటల్ లాంగ్వేజెస్ చదివి ఆపై కాకతీయయూనివర్సిటీకి చెందిన బి.ఇడి.కళాశాలలో తెలుగు పండిత శిక్షణ కూడా పూర్తి చేసారు.


కాని మనం అనుకున్నవి జరిగితే అది జీవితమెందుకవుతుంది?
అప్పట్లో మల్టీ పర్పస్ లేదా హెచ్.ఎస్.సి.లో ఎక్కువ మార్కులు వచ్చిన వారికి పోస్టల్డిపార్టుమెంటులో ఉద్యోగాలు భారీ ఎత్తున వచ్చాయి.ఇతర ప్రాంతాల వారి వల్ల ఆపోస్టల్ డిపార్టుమెంటులో కూడా రావలసిన ఉద్యోగం రాలేదు.దాంతో తొమ్మిదేళ్లపాటు ఏవో చిన్నచిన్న వృత్తులు చేస్తూ నిరుద్యోగ జీవితం అనుభవించారు.

నిరుద్యోగ పర్వంలోనే శ్యామలగారితో వివాహం జరిగింది.చివరకు పెళ్లైన రెండేళ్లకు చాలామందిలాగే చదివిన చదువుకు సంబంధంలేని ఉద్యోగం సాంఘిక సంక్షేమశాఖలో-దొరికింది.
అలా ఉద్యోగరీత్యా మా ఎలగందుల-



లో మూడేళ్లపాటు పనిచేసినప్పుడు ఒకే ప్రాంగణంలోపక్క పక్కఇండ్లలో నివసించినప్పుడు తొలి పరిచయం. అప్పటికి ఆయన మామూలు ఉద్యోగిగా మాత్రమే తెలుసు.
ధర్మపురిలో చదువుకునే రోజుల్లో ఆరెస్సెస్ లో చేరి ముఖ్యశిక్షక్ గా పనిచేసిన వ్యక్తి,
ఉద్యోగం వచ్చిన తరువాత ఉద్యోగుల సంఘం నిర్వాహకుడిగా ఉంటూ తదుపరియువజనసంఘాల నిర్మాణంవైపు మళ్లి,అంబేద్కర్ సంఘాల నిర్మాణం,క్రమంగాపౌరహక్కుల సంఘం,విరసం,రాడికల్ యువసంఘాలు ఇలా ఆయన జీవితాన్నికొత్తబాటకు మళ్లించాయి.ఈ దశలోనే కొంతకాలం ఉద్యోగంలో అంతరాయం ఏర్పడిఐదేళ్లు బహిరంగజీవితానికి దూరమయ్యారు.ఆ సమయంలో ఆయన సతి శ్యామలగారుఎంతో నిబ్బరంతో ఇల్లు వెళ్లదీయటం ఆయన ఎన్నడూ మరువలేని విషయం.

ఇటు అనేక ఉద్యమాలలో క్రియా శీల కార్యకర్తగా ఉంటూ,అటు అధ్యయనం కూడాచేయటం మామూలు విషయం కాదు.అలాగే





రచనలు చేయడం కూడా ఎన్నడు ఆపలేదు.లేకపోతే గత నాలుగు దశాబ్దాలలో ఆయన వెలువరించిన పుస్తకాలసంఖ్య వందకు దాటిఉండదు.

కథలు, నవలలో గాక తత్వ శాస్త్రానికి ,వర్తమాన రాజకీయాంశాలు -సామాజికాంశాలు మరియు వ్యక్తిత్వ వికాసం,సాహిత్య విశ్లేషణ -అలంకార శాస్త్రాలు,బీసీ లగురించిరాసినవి,తెలంగాణ రాష్ట్ర ఉద్యమాలు చరిత్ర,సంస్కృతి గురించి ఇలా వైవిధ్యం తో కూడుకున్న పుస్తకాలు శతాధిక పుస్తకాలు వెలువరించిన ఘనుడు బి.ఎస్.రాములు-గారు.!ఇంకా అముద్రితాలు కూడా ఉన్నాయంటే ఆయనరచనా దీక్ష ఎంతటిదో అర్థమౌతుంది.ఇవే గాక ఈయనపై వచ్చిన పుస్తకాలుపది-పన్నెండు ఈయన సంపాదకత్వం లో వచ్చిన పుస్తకాలు నలభైకి పైగా ఉన్నాయనేదిఆయన ఉద్యమశీల తత్త్వాన్ని చాటి చెబుతుంది.

ఉత్తర తెలంగాణ జిల్లాలలోని బీడీకార్మికుల ఒడిదుడుకుల జీవితాలను ఉన్నదిఉన్నట్టుగ నవలీకరించిన 'బతుకు పోరు'దాశరథి వంటి మహాకవులమన్ననలందుకున్న ది. మరో నవల 'చూపు'అనేక పాత్రల ద్వారాసమయోచిత చర్చల ద్వారా కథను నడిపించడంతో తెలంగాణ రాష్ట్రం,భారత దేశంగురించిన సమకాలీన పరిస్థితులు అవగాహనకు వస్తాయి.ఒక రకంగా ఇది పాఠకులనుఎన్లైట్ చేయడం కోసం రాసిన నవల.జార్ఖండ్,ఛత్తీస్ ఘడ్,ఉత్తరాఖండ్ రాష్ట్రాలఏర్పాటు ఆవశ్యకతను నాలుగు కుటుంబాలకు చెందిన వ్యక్తులతో అవగాహనకలిపించడం రచయిత రచనా నైపుణికి గీటురాయి.

నిదానకవి నీరజ,అసోసియేట్ ప్రొఫెసర్ (తెలుగు) ప్రభుత్వ డిగ్రీ




కళాశాల ఖైరతాబాద్ గిరి ఆధ్వర్యంలో 'బి.ఎస్.రాములు సాహిత్య సమాలోచన రెండు రోజుల పాటు జరిగి పలువురు ఆయన రచనలపైపత్రసమర్పణచేయటమైనా,బి.ఎస్.రాములు సాహిత్యం సమగ్ర పరిశీలన అన్న అంశంపైసిద్ధాంతగ్రంథం సమర్పించిన డా .కర్రె సదాశివ్ గారి ప్రయత్నమైనా బి.ఎస్ .రాములురచనలు ఎంత విశిష్టమైనవో తెలియపరుస్తాయి.

50 ఏళ్ల తెలుగు కథ తీరు తెన్నులను 'సమగ్ర సామాజిక కథ-తాత్విక భూమిక అనే పేరుతో ,కథల బడి సాహిత్య అలంకారశాస్త్రం రాసిన రాములు గారు అడవిలో వెన్నెల,కాలం తెచ్చిన మార్పు వంటి కథల సంపుటులు వెలువరించారు.

కొత్త సిలబస్ అనే సామాజిక శాస్త్రం, ప్రాంతీయ అస్తిత్వం తెలంగాణా అస్తిత్వం,ఒక సృష్టికర్త ఆత్మ చింతన వంటి ఎన్నోవిలువైన పుస్తకాలు రచించిన సామాజిక కర్మయోగి బి.ఎస్.రాములు.

ఒకప్పటి కరీంనగర్ జిల్లా లోని తాలుకా కేంద్రమైన జగిత్యాల నేడు జిల్లాకేంద్రం.ఆజగిత్యాల పట్టణంలో అగస్టు 23,1949 న జన్మించారు. తల్లిదండ్రులు పద్మశాలికుటుంబానికి చెందిన శ్రీమతి బేతి లక్ష్మిరాజు,మిట్టపెల్లి నారాయణ దంపతులద్వితీయపుత్రుడు.బొంబాయి బట్టల మిల్లు కార్మికుడైన తండ్రి చిన్నతనంలోనే మృతిచెందడంతో తల్లి బీడీ కార్మికురాలిగా పిల్లలను పెంచి పెద్ద చేసింది.

ఇక అవార్డుల విషయానికి వస్తే తెలుగు విశ్వవిద్యాలయం వారి 'హేతువాదపురస్కారం,'మమతలు-మానవ సంబంధాలు' కథల సంపుటికి ఉత్తమ కథారచయితపురస్కారం,దాశరధి రంగాచార్య,ఆచార్యకొండాలక్ష్మణ్ బాపూజీ పురస్కారాల వంటివిఎన్నో ఉన్నాయి. రాష్ట్రేతరంగా పానిపట్ లోని 'రామవృక్ష బేనిపురి' పురస్కారం , తెలంగాణ తల్లి రూపకల్పనకు తెలంగాణ సంబురాలు కార్యక్రమంలో బంగారుగండపెండేరంతో సత్కారం, డా.పి. యశోదారెడ్డి స్మారక తొలి పురస్కారంగా స్వర్ణ కంకణంవంటివి ఎన్నో ఉన్నాయి.

ప్రస్తుతం తన ఆత్మకథా రచనలో సం లగ్నమై ఉన్న రాములు సారు నాకుఆత్మీయులనటం కంటే ఎందరికో ఆత్మీయులు.మనిషిని మనిషిగా ప్రేమించేనిగర్వి.సమాజ




హితం కోసం నిరంతరం తపించే అరుదైన వ్యక్తులు ఏ కొందరో ఉంటారు.అలాంటి అరుదైన వ్యక్తి బి.ఎస్.రాములు గారు మరిన్ని విలువైన పుస్తకాలువెలువరించాలని వారికి అందుకు కావలసిన శక్తి ఒనగూడాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ చిరు పరిచయవ్యాసం కొండను అద్దంలో చూపినట్టుగా ముగిస్తున్నాను.

# కాళిదాసు తెలుగువాడా?



వేమూరి వేంకటేశ్వరరావు

అది ధారా నగరంలో వారవనితల వీధి. ఆ వీధిలో ఒక రంగుటద్దాల మేడ! ఆ మేడ వసారాలో, పూసల తెరల వెనుక, పందొమ్మిదేళ్ళ పడుచు పిల్ల తూగుటుయ్యాలలో ఊగుతూ ఏవేవో శ్లోకాలు రాగయుక్తంగా వల్లె వేస్తోంది.

అదే వీధమ్మట పిచ్చాపాటి కబుర్లు చెప్పుకుంటూ భవభూతి, కాళిదాసూ వీనుల విందుగా వినబడుతున్న ఆ స్వరానికి ఆకర్షితులై అటు వైపు చూసారు. తాంబూల చర్వణంతో ఎర్రగా పండిన ఆ అమ్మాయి అధరాలు చూడగానే వారిరువురికి తాంబూలం స్ఫురణకు రాగా తమ తమ తాంబూల కరండాలని తెరచి చూసుకున్నారు. భవభూతి పెట్టెలో సున్నము నిండుకుంది. అప్పుడు భవభూతి ఆ అమ్మాయిని ఉద్దేశించి,

"తూర్ణమానీయతాం చూర్ణమ్ పూర్ణచంద్రనిభాననే"

అని అడిగేడు. అనగా, "పున్నమి చంద్రునివంటి ముఖము గల ఓ సొగసరీ! కాసింత సున్నం తెచ్చిపెట్టు" అని అర్థం. తన పెట్టెలో తమలపాకులు కూడా లేకపోవడం చూసి, వెంటనే కాళిదాసు,



"వర్ణాని స్వర్ణపర్ణాని కర్ణంతాకీర్ణలోచనే"

అంటూ శ్లోకాన్ని పూర్తి చేసేడు. అనగా, "చెంపకి చేరడేసి కళ్ళు గల ఓ చక్కని చుక్కా! పసిడివన్నె గల లేత తమలపాకులు కూడా!" అని అర్థం.

మహాకవులు వలె ఉన్న ఆ ఆగంతుకులని చూచి, చటుక్కున లేచి, అంజలి ఘటించి, వారిరువురికి ఉచితాసనాలు చూపించి, లోపలికి వెళ్లి ఆకులూ, వక్కలు, సున్నం ఉన్న వెండి పళ్లెం వారి ముందు ఉంచి, వినయము, విలాసము ఉట్టిపడుతూ ఉండగా మొదట కాళిదాసుకి తమలపాకులు, తదుపరి భవభూతికి సున్నం అందించింది ట!

ఈ ప్రవర్తన చూసి భవభూతి కోపోద్రేకుడై, "ఏమిటీ పక్షపాతం? సున్నం తెమ్మని ముందస్తుగా అడిగింది నేను. తరువాత కదా కాళిదాసు ఆకులు అడిగింది? ఇదెక్కడి ధర్మం?" అని నిలదీసి అడిగేడు ట.

దానికి ఆ అమ్మాయి సిగ్గుతో ఎర్రబడిన బుగ్గలతో, "క్షమించాలి. పూజా వ్యతిక్రమం జరిగితే మన్నించాలి. సామాన్య ధర్మం మాట ఎలా ఉన్నా, మా వృత్తి ధర్మం ప్రకారం మిక్కిలి రొక్కము ఇచ్చినవారంటేనే మా కులంవారు ఎక్కువ మక్కువ ప్రదర్శిస్తారు. తక్కినవాళ్లు తరువాతే!" అని గడుసుగా సమాధానం చెప్పిందిట!

ఆ జవాబు విని ఆ అమ్మాయి సమయస్ఫూర్తికి, సంవాద చాతుర్యానికి ముచ్చటపడి, కవులిద్దరూ ఆమెని మనసారా ఆశీర్వదించి, ముందుకి కదిలేరుట! అదీ కథ!!

ఈ కథ కంచికి వెళ్ళలేదు. ఎందుకంటే ఈ కథనంలో ఎక్కడా డబ్బు ప్రసక్తి లేనే లేదే! ఆ కవులు ఇచ్చినదీ లేదు, ఆమె పుచ్చుకున్నదీ లేదు.

పైన ఉదహరించిన శ్లోకంలో ఒక చమత్కారం ఉంది. అదే కథకి ఆయువుపట్టు. భవభూతి చెప్పిన శ్లోక పాదంలో తూర్ణ, చూర్ణ, పూర్ణ అనే మాటలలో మూడు "ణ" లు ఉన్నాయి. కాళిదాసు పూర్తి చేసిన పాదంలో వర్ణ, స్వర్ణ, పర్ణ, కర్ణ, అకీర్ణ అనే మాటలలో అయిదు "ణ" లు ఉన్నాయి. ఈ ణ అనే అక్షరాన్ని తెలుగువారు "అణా" అని ఉచ్చరిస్తారు: ట, ఠ, డ, ఢ, అణా. కానీ అణా అనేది ఒక నాణెం కూడా కదా! ఈ కోణంలో చూస్తే భవభూతి ముట్టజెప్పినది మూడు అణాలు, కాళిదాసు ఇచ్చినది అయిదు అణాలు అని మనం అన్వయించుకోవాలి.

ఇంతవరకు వచ్చిన తరువాత నిజం చెప్పకపోతే మర్యాదగా ఉండదు. కాళిదాసు, భవభూతి సమకాలికులు కానేకారు! ఇది కేవలం కట్టుకథ! పైపెచ్చు కాళిదాసు తెలుగువాడు కాదనేదే అందరి అభిమతమూను. భవభూతి సంగతి నాకు తెలియదు కానీ, తెలుగువాడు కాకపోవచ్చు. అలాంటప్పుడు ఈ కథలోకి అణా ఎలా వచ్చిందబ్బా? మూడొంతుల ముప్పాతిక ఆ అమ్మాయి పదహారణాల తెలుగు పిల్ల అయి తీరాలి.

పోనీ, మాటవరసకు కాళిదాసు, భవభూతి, ఆ విలాసవతి - అందరు ఆంధ్రులే అనుకుందాం. అయినా కలికాలం కాకపోతే కాళిదాసు కాలం నాటికి మన దేశంలో అణా లు ఎక్కడివి? అణా అనే మాటకి అస్తిత్వం ఇటీవలి కాలంలో వచ్చింది.. ముస్లిం పాలన చివరి రోజులలో పదహారో వంతుని "అనా" అని పిలిచేవారు. "పెట్టుబడిలో అణా వంతు" అనే వాడుక అక్కడినుండి వచ్చినదే. ఇంగ్లీషువాళ్ళు ఇండియా వచ్చిన తరువాత రూపాయలో పదహారో వంతుకి అణా అనే నాణెం వాడుకలో ఉండేది - మనకి స్వతంత్రం వచ్చేదాకా! రెండణాల విలువ గల నాణెం పేరు బేడ, నాలుగు అణాల విలువ గల నాణెం పేరు పావలా. అణా లో సగం విలువ గలది అర్ధణా. అణా లో నాలుగోవంతు విలువ గలది కాలణా; ఈ కాలణా క్రమేపి కానీ అయింది. అణాలు కాలగర్భంలో కలిసిపోయినప్పటికీ బంగారాన్ని తూకం వేసేటప్పుడు తులంలో పదహారో వంతుని "అణా ఎత్తు బంగారం" అని అనేవారు; ఇప్పుడంటున్నారో లేదో తెలియదు.

ఈ కథనాన్ని బట్టి ఈ కథ అంతా నూటికి నూరు పాళ్ళు తెలుగు వాళ్ళ సృష్టి!

ఈ కథ విన్న తరువాత "భోజనం దేహి రాజేంద్ర ...మాహిషంచ-శరశ్చన్ద్రచంద్రికా ధవళందధి" అన్న శ్లోకం కూడా ఎర్రగా కాచిన బర్రె పాలని తోడు పెట్టగా వచ్చిన మీగడ పెరుగుని తినమరిగిన తెలుగువాడే సృష్టించి ఉంటాడేమో అనే అనుమానం పీకుతోంది.


గమనిక: ఈ కథ మొదటిసారి కీ. శే. ఆచార్య తూమాటి దొణప్ప (ఉపకులపతి, తెలుగు విశ్వవిద్యాలయం) చెప్పగా విన్నది. ఈ కథ రకరకాల మార్పులతో ప్రచారంలో ఉందని మరికొందరు చెప్పేరు.






2022 ఫ్రెంచ్ ఓపెస్ టెన్నిస్ ఛాంపియస్

RNI No. APTEL/2011/39497 JULY 2022 POSTAL NO. HSE/1043/2017-19
Date of Publication:1st July Date of Posting:8th July




Published, Edited and Printed by T Shanti at Flat No. 45058, Janapriya Utopia, Hyderguda, Attapur, Hyderabad-500048. Phone 9490571297 email: teega51@gmail.com , www.chaitanyam.net, Printed at Planographers, 5-8-300, Chirag Ali Lane, Abids, Hyderabad-500001.